RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక


www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 333 మేడ్చల్ మల్కాజ్‌గిరి 24 డిసెంబర్ 2024 మంగళవారం పేజీలు : 4

## ఈసీ సమగ్రతను దెబ్బతీసే కుట్ర

న్యూఢిల్లీ : కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) సమగ్రతను మోదీ ప్రభు త్వం నాశనం చేస్తోందని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఎలక్ట్రానిక్ సమాచారమైన సీసీటీవీ ఫుటేజీ, అభ్యర్థుల వీడియో రికార్డులను ప్రజల తనిఖీ నిమిత్తం ఇవ్వాల్సిన పనిలేదంటూ కేంద్ర న్యాయశాఖ నిబంధనలను సవరించడాన్ని రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై దాడిగా అభివర్ణించారు. 'తొలుత ఎన్నికల కమిషనర్ల నియామక ప్యానెల్ నుంచి వారు భారత ప్రధాన న్యాయమూర్తిని తొలగించారు.

ఇప్పుడు హైకోర్టు ఆదేశాలున్నా.. ఎన్నికలకు సంబంధించిన సమాచారం ఇవ్వకుండా అడ్డుకున్నారు. క్వాసీ-జ్యుడీషియల్ సంస్థ అయిన ఈసీ.. స్వతంత్రంగా వ్యవహరించడం లేదనడానికి ఇది మరో రుజువు' అని ఖర్గే పేర్కొన్నారు.




# తెలంగాణ రాజకీయాల్లో... కీలక మలుపులు..!!

## నూతన సంవత్సరంపై కోటి ఆశలతో రాజకీయపార్టీలు

హైదరాబాద్ : తెలంగాణలో 2024 సంవత్సరం రాజకీయ పార్టీలకు మిశ్రమ ఫలితాలను ఇచ్చింది. అధికారం లోకి వచ్చిన తరువాత రేవంత్ 2024 లో రేవంత్ తన మార్క్ పాలన చూపించారు. బీఆర్ఎస్ పూర్తిగా ఈ ఏడాది ఆత్మరక్షణలో కనిపించింది. బీజేపీ 8 ఎంపీ స్థానాలు గెలవటంతో భవిష్యత్ పైన ఆశలతో కనిపిస్తోంది. ఇక..కవిత అరెస్ట్ రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. హైడ్రా ..మూసీ వివాదాల చుట్టూ రాజకీయాలు తిరిగాయి. తెలంగాణ రాజకీయాల్లో 2024 బిగ్ టర్న్ గా మారింది.

**కలిసొచ్చిందెవరికి...** 2024 సంవత్సరం ముగుస్తోంది. ఈ ఏడాది రాజకీయంగా తెలంగాణలో అనేక పరిణామాలు చోటు చేసుకున్నాయి.

2023 చివర్లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఈ ఏడాది జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో నూ బలం చాటుకుంది. తెలంగాణలోని మొత్తం 17 లోక్ సభ స్థానాల్లో కాంగ్రెస్ 8, బీజేపీ 8, ఎంఐఎం 1 ఎంపీ సీటు కైవసం చేసుకున్నాయి. బీజేపీ మూడు ఎంపీ సీట్ల నుంచి 8 ఎంపీ సీట్లను బీజేపీ గెలుచుకుంది.

పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవ లేకపోయింది. దీంతో, కాంగ్రెస్ - బీజేపీ ఈ ఎన్నికల్లో రెండు ప్రధాన పార్టీలుగా కనిపిస్తున్నాయి.

**కవిత అరెస్ట్ తో...** 2024 లో కవిత అరెస్ట్ రాష్ట్ర రాజకీయాల్లో సంచలనంగా మారింది. ఢిల్లీ మద్యం కేసులో కవిత ను ఈడీ మార్చి 15న అరెస్ట్ చేసింది. 165 రోజులు జైలు జీవితం అనుభవించిన కవితకు సుదీర్ఘ పోరాటం తరువాత సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి.. లోక్ సభ ఎన్నికల్లో ఒక్క సీటు గెలవకపోవటం.. ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలు వరుసగా పార్టీ వీడటం తో బీఆర్ఎస్ బలహీన పడింది. కేసీఆర్ పూర్తిగా మౌనం దాల్చారు. పార్టీ సమావేశాలు మినహా, పార్ల మెంట్ ఎన్నికల ప్రచారం తరువాత ఎక్కడా కనిపించ లేదు. కాంగ్రెస్ పైన వ్యతిరేక ఉందని పార్టీ నేతలకు చెబుతున్న కేసీఆర్.. ప్రజాక్షేత్రంలోకి రావటం పైన ఎలాంటి కార్యాచరణ లేదు. అదే విధంగా ఈ ఏడాది కాలంలో ఒకే ఒక్క రోజు కేసీఆర్ ప్రతిపక్ష నేత హోదాలో అసెంబ్లీకి వచ్చారు.

**బీఆర్ఎస్ కు చేదు ఫలితాలు...** గులాబీ పార్టీ నుంచి కాంగ్రెస్ లోకి మారిన వారి పైన అనర్హత వేటు కోసం బీఆర్ఎస్ నేతలు న్యాయ పరంగా పోరాటం చేస్తున్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారం కోర్టు పరిధిలో ఉంది. కేసీఆర్ మౌనంతో పార్టీలో కేటీఆర్, హరీష్ కీలకంగా మారుతున్నారు. కాంగ్రెస్ పార్టీ ఈ ఏడాది కాలంలో తమ స్థానం సుస్థిరం చేసుకునే ప్రయత్నాలు చేసింది. సీఎం రేవంత్ తన మార్క్ చూపించేందుకు అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆశించిన స్థాయిలో సీట్లు రాకపోయినా.. గతం కంటే బాగా పుంజుకంది. బీఆర్ఎస్ ను సున్నాకు పరిమితం చేసింది. ఇక, రాష్ట్రంలో బీజేపీ తో హోరా హోరీ తల పడుతోంది.

**కొత్త వ్యూహాలతో...** రైతు రుణమాఫీ అమలు ద్వారా కీలకమైన ఎన్నికల వాగ్దానం రేవంత్ అమలు చేసారు. హైడ్రా, మూసీ వంటి నిర్ణయాలు వివాదాస్పదంగా మారటంతో..రేవంత్ ఆచి తూచి అడుగులు వేస్తున్నారు. బీజేపీ సామాజిక సమీకరణాలే అస్త్రాలు గా తెలంగాణలో బలపడటానికి ప్రాధాన్యత ఇస్తోంది. దీంతో, మూడు పార్టీలు 2025 లో మరింత గా ఎదిగేలా కొత్త వ్యూహాలతో సిద్ధం అవుతున్నాయి.

# 71 వేల మంది యువతకు జాబ్ లెటర్‌లు ఇచ్చిన ప్రధాని

ప్రధాని నరేంద్ర మోదీ సోమవారం వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా కొత్తగా నియామకమైన 71,000 మందికి పైగా యువతకు అపాయింట్‌మెంట్ లెటర్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ప్రసంగిస్తూ కొత్తగా నియమితులైన వారిని అభినందించారు. ప్రధాని మాట్లాడుతూ భారతదేశ యువతతో మాట్లాడేందుకు తాను కువైట్ నుంచి రాత్రి భారత్ వచ్చానని పేర్కొన్నారు. ఇక్కడికి వచ్చిన తర్వాత దేశంలోని యువతతో తన మొదటి కార్యక్రమం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు పొందిన వారి కుటుంబాలకు హృదయపూర్వకంగా అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. భారతదేశ యువత సామర్థ్యాన్ని, ప్రతిభను పూర్తిగా వినియోగించుకోవడమే ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమని ప్రధాని ఉద్ఘాటించారు. రోజ్‌గార్ మేళా ద్వారా ఈ దిశగా నిరంతరం కృషి చేస్తున్నామని ప్రధాని మోదీ ప్రస్తావించారు. గత 10 సంవత్సరాలుగా వివిధ ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, సంస్థల్లో ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించాలనే ప్రచారం జరుగుతోందన్నారు. నేటికీ 71,000 మందికి పైగా యువతకు అపాయింట్‌మెంట్లు ఇచ్చారు. గత ఏడాదిన్నర కాలంలో మా ప్రభుత్వం దాదాపు 10 లక్షల మంది యువతకు ప్రభుత్వ ఉద్యోగాలను శాశ్వతంగా కల్పించిందని మోదీ పేర్కొన్నారు. ఇది స్వతహాగా భారీ రికార్డు అని ప్రధాని అన్నారు. ఈ విధానంలో యువతకు శాశ్వత ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించేందుకు గత ప్రభుత్వాల హయాంలో ఇలాంటి చొరవ జరగలేదని, నేడు దేశంలో లక్షలాది మంది యువత ఉద్యోగాలు పొందారని పేర్కొన్నారు. ఏ దేశమైనా



అభివృద్ధి చెందాలంటే యువత బలం, నాయకత్వం నుంచే పుడుతుందని ప్రధాని అభిప్రాయం వ్యక్తం చేశారు.

**యువతను కేంద్రంగా చేసుకుని...** పారదర్శకమైన సంప్రదాయం నుంచి వస్తున్న యువత పూర్తి భక్తి, నిజాయితీలతో దేశ సేవలో నిమగ్నమై ఉన్నందుకు సంతోషిస్తున్నట్లు ప్రధాని అన్నారు. 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన భారతదేశంగా తీర్చిదిద్దాలన్నది మా సంకల్పమన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించడంలో పూర్తి విశ్వాసం ఉందన్నారు. గత దశాబ్ద కాలంలో ప్రభుత్వం అనేక విధానాలను తీసుకొచ్చిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. మేక్ ఇన్ ఇండియా, స్వావలంబన భారత్ ప్రచారం, స్టార్టప్ ఇండియా, స్టాండ్ అప్ ఇండియా, డిజిటల్ ఇండియా ఇలా ప్రతి స్కీమ్ యువతను కేంద్రంగా చేసుకుని రూపొందించినట్లు వెల్లడించారు.

**స్టార్టప్ వ్యవస్థలో..** అంతరిక్ష రంగంలో భారత్ తన విధానాలను మార్చుకుంది. భారతదేశం తన రక్షణ రంగంలో తయారీని ప్రోత్సహించింది. దీనిలో యువత ఎక్కువగా లాభపడింది. నేడు భారతదేశ యువత కొత్త విశ్వాసంతో నిండి ఉంది. ప్రతి రంగంలోనూ యువత విజయపతాకం రెపరెపలాడుతోంది.

ప్రపంచంలో ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మనం అవతరించామని ప్రధాని గుర్తు చేశారు. భారతదేశం ప్రపంచంలో మూడవ అతిపెద్ద స్టార్టప్ పర్యావరణ వ్యవస్థగా ఉంది. ఈ క్రమంలో ఒక యువకుడు తన సొంత స్టార్టప్‌ను ప్రారంభించాలని నిర్ణయించుకున్నప్పుడు, వారు పూర్తి పర్యావరణ వ్యవస్థను పొందుతారని పేర్కొన్నారు. ఈ క్రమంలో నేడు దేశంలోని వేలాది మంది యువత జీవితాలు కొత్త పుంతలు తొక్కుతున్నాయని పేర్కొన్నారు.

**ప్రతి రంగంలో కూడా..** భారతదేశం మొబైల్ తయారీ రంగంలో ప్రపంచంలోనే రెండో అతిపెద్ద దేశంగా అవతరించిందని ప్రధాన మంత్రి అన్నారు. నేడు, పునరుత్పాదక ఇంధనం నుంచి సేంద్రీయ వ్యవసాయం వరకు, అంతరిక్ష రంగం నుంచి రక్షణ వరకు, పర్యాటకం నుంచి వెల్‌నెస్ వరకు, దేశం ప్రతి రంగంలో కొత్త శిఖరాలను చేరుకుంటోందని మోదీ వెల్లడించారు.

ఈ క్రమంలో దేశ నిర్మాణం, స్వయం సాధికారతలో యువత భాగస్వామ్యానికి అర్థవంతమైన అవకాశాలను అందించే దిశగా ఉపాధి మేళా ఒక ముందడుగు అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.



## డిసెంబరు 30న తెలంగాణ మంత్రివర్గ సమావేశం

హైదరాబాద్: డిసెంబరు 30న తెలంగాణ మంత్రివర్గ సమావేశం నిర్వహించనున్నారు. రైతు భరోసా, రేషన్ కార్డుల జారీ విధివిధానాలపై చర్చించే అవకాశముంది. భూమిలేని పేదలకు నగదు బదిలీ, యాదగిరిగుట్ట ఆలయ బోర్డు అంశాలు కూడా చర్చకు వచ్చే అవకాశముంది. సంక్రాంతి పండుగకు రైతు భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీ. ఇందిరమ్మ ఇళ్ళ పంపిణీ తదితరాలు పక్కాగా లబ్ధిదారులకు అందజేయాలనే దృఢ సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం ఉంది. దీంతో ఈ సారి మంత్రి వర్గ సమావేశంపై రాష్ట్ర ప్రజలు ఆసక్తిగా దృష్టి పెట్టారు.

# ఆ సత్తా ఈటెలకే ఉందా..?

## బిజేపీ పెద్దల ఆలోచనేంటి..?

## సారధి రేసులో ముందున్న ఈటెల!




హైదరాబాద్ : యుద్ధంలో పోరాడేందుకు తెలంగాణ బిజేపీకి బలమైన క్యాడరుంది.. సంస్థాగతంగా బలోపేతం అయ్యేందుకు అవకాశాలూ ఉన్నాయి.. గత ఎన్నికల్లో బలమైన ఓటు షేర్ సాధించి.. తెలంగాణాలో తామే ప్రత్యామ్నాయ పార్టీ అని నేతలు చెబుతున్నారు.. మరింత బలోపేతం అవ్వాలని చూస్తున్న ఆ పార్టీకి త్వరలో నూతన అధ్యక్షులు రాబోతున్నారు.. తెలంగాణాలో బలమైన శక్తిగా ఎదగాలని భావిస్తున్న బిజేపీ.. కొత్త అధ్యక్షుడిని నియమించే కసరత్తు జరుగుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర కాషాయ దళపతి అయ్యేందుకు నలుగురు నేతలు తీవ్రంగా పోటీ పడుతున్నారట. తనకు అధ్యక్ష బాధ్యతలు ఇస్తే పార్టీని పవర్ లోకి తెస్తానంటూ కేంద్రం పెద్దల వద్ద చెబుతున్నారట.. అయితే అధిష్టానం మాత్రం.. సరైన టైమ్ లో.. సరైన నేతకు పగ్గాలు అప్పగించాలని యోచిస్తోందన్న టాక్ కమలం పార్టీ నుంచి వినిపిస్తోంది.. సంస్థాగత ఎన్నికలపై తెలంగాణ బీజేపీ ఫోకస్ పెట్టింది. బూత్ స్థాయి నుంచి మొదలుకుని రాష్ట్ర, జాతీయ అధ్యక్షుడి వరకు ఎన్నికల ప్రక్రియ ద్వారా నియామకం జరగనుంది. డిసెంబర్ నెలాఖరున రాష్ట్ర అధ్యక్ష పదవికి, జనవరిలో జాతీయ అధ్యక్ష పదవికి ఎన్నిక జరిగే అవకాశముంది. ఈ క్రమంలో తెలంగాణ బిజేపీ అధ్యక్ష పదవి ఎవరిని వరిస్తుందా అన్న ఉత్కంఠ అందరిలోనూ ఉంది.. అయితే దీనిపై అధిష్టానం ఇప్పటికే ఓ క్లారిటీకి వచ్చిందన్న ప్రచారం డిల్లీ స్థాయిలో జరుగుతోంది.. మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్ పేరు బీజేపీ స్టేట్ ప్రెసిడెంట్ రేసులో ప్రముఖంగా వినిపిస్తోంది.

బండి సంజయ్ ని అధ్యక్షుడిగా తప్పించి.. కిషన్ రెడ్డికి బాధ్యతలు ఇచ్చే సమయంలోనే ఈటల ప్రెసిడెంట్ అవుతారని చర్చ జరిగింది. కానీ అది వర్కౌట్ అవ్వలేదు.. అయితే ఈసారి ఈటల రాజేందర్ ని అధ్యక్షున్ని చేసి.. బీసీ నేతకు అవకాశం ఇచ్చామని ప్రజల్లోకి తీసుకెళ్లాలని బిజేపీ భావిస్తోందట.. సమర్ధవంతమైన నేతగా.. రాజకీయాల్లో అపర చాణుక్యునిగా పేరున్న ఆయనకి బాధ్యతలు ఇచ్చి.. వచ్చె ఎన్నిల్లో అధికారంలోకి రావాలని కమలం పార్టీ వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నట్లు రాజకీయవర్గాల్లో టాక్ వినిపిస్తోంది.. తెలంగాణలో అత్యధిక బీసీ జనాబా ఉండటంతో.. బీసీకార్డు కలిసొచ్చే అంశమని.. పార్టీని అధికారంలోకి తీసుకొచ్చే సత్తా ఈటెలకే ఉందన్న అభిప్రాయంలో డిల్లీ పెద్దాలు ఉన్నారట.. డిసెంబర్ చివరిలో ఆయన బాధ్యతలు అప్పగించే అవకాశముంటుందని తెలంగాణ సీనియర్లు చర్చించుకుంటున్నారు.. తెలుస్తోంది.

# సంపాదకీయం

## ప్రెస్ మీట్ స్క్రిప్టు ఎవరిది పుష్పా?

కొన్ని పనులు అస్సలు చేయకూడదు. మన మీద మనకు ఆత్మవిశ్వాసం ఉండొచ్చు. అంత మాత్రాన.. దాన్నే నమ్ముకుంటే ఎలా దెబ్బ తింటారన్న విషయం చాలా సందర్భాల్లో చాలా మంది ప్రముఖుల విషయంలో జరిగింది. ఇప్పుడు అలాంటిదే ప్రముఖ నటుడు అల్లు అర్జున్ అలియాస్ పుష్ప విషయంలోనూ జరుగుతోందని చెప్పాలి. సంధ్య థియేటర్ ఎపిసోడ్ లో ఏం జరిగిందన్నది అందరికి తెలిసిందే. ప్రత్యేకంగా దాని గురించి మాట్లాడాల్సిన అవసరం లేదు. అయితే.. ఇక్కడ సమస్య మొత్తం సంధ్య థియేటర్ దగ్గర జరిగిన విషాదం ఒక ఎత్తు అయితే.. దాని తర్వాత అల్లు అర్జున్ స్పందన ఏమిటి? అన్నది మరొక ప్రశ్న. నిజానికి ఇక్కడే ఆయన తీవ్ర విమర్శలకు గురవుతున్నారు. తన సినిమా చూసేందుకు వచ్చిన సందర్భంగా చోటు చేసుకున్న తొక్కిసలాట ఒక ఎత్తు అయితే.. దాని కారణంగా ఒక నిండు ప్రాణం పోవటం.. అంత విషాదం జరిగిన తర్వాత దాదాపు రెండు గంటల పాటు సినిమాను చూసారని పోలీస్ లు చెప్పడం .. పోలీసులు స్పష్టంగా చెప్పిన తర్వాత.. తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే ఆయన సినిమా నుంచి బయటకు వచ్చేశారని చెబుతుండటం . ఈ విషయం తాజాగా పోలీస్ లు బయటకు తీసుకు వచ్చిన వీడియో ప్రూఫ్ గా చెప్పడం . అయితే.. ఆ విషయాల్ని పట్టించుకోకుండా తనను తాను సమర్థించుకోవటం.. తన చర్యల్ని గొప్పగా చెప్పుకోవటం అప్పుడప్పుడు కొందరు చెప్పుకుంటారు. అలాంటి పనే చేశారు అల్లు అర్జున్. జరిగింది ఒకటైతే.. దానికి భిన్నంగా అల్లు అర్జున్ స్పందించిన తీరు ఆయన్ను విమర్శల పాలు చేస్తోంది. ఇదంతా ఒక ఎత్తు అయితే.. అసెంబ్లీ లో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడిన తర్వాత.. అల్లు అర్జున్ తో పాటు సినీ పరిశ్రమ మీద తీవ్ర వ్యాఖ్యలు చేసిన తర్వాత.. కేవలం మూడు గంటల వ్యవధిలో అల్లు అర్జున్ ప్రెస్ మీట్ పెట్టటం ఆసక్తికరంగా మారింది. ఇప్పటికైనా జరిగిన తప్పునకు చెంపలు వేసుకుంటారని చాలామంది భావించినా.. ఆయన మాత్రం అందుకు భిన్నంగా అసెంబ్లీలో సీఎం చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇవ్వటం ద్వారా కొత్త యుద్ధానికి తెర తీశారని చెప్పాలి. ఎప్పుడు యుద్ధం మొదలు పెట్టాలన్నది ఒక ఎత్తుగడ. అదే టైంలో ఎప్పుడు ఆపేయాలన్నది కూడా తెలిసి ఉండాలి. కానీ.. అల్లు అర్జున్ ఈ రెండు విషయాల్లోనూ వీక్ అన్న విషయం తాజా ఎపిసోడ్ చూస్తే అర్థమవుతుంది. సినిమాలో సీన్లు మొత్తం దర్శకుడి కంట్రోల్ లో ఉంటాయి. కానీ.. రియల్ లైఫ్ లో అలా ఏమీ ఉండదు. ఎవరికి వారి చేతుల్లోనే ఉంటాయి. ఈ చిన్న విషయాన్ని అల్లు అర్జున్ ఎలా మిస్ అయ్యారు. అల్లు అర్జున్ ప్రెస్ మీట్ పెట్టిన పదహారు.. పదిహేడు గంటల తర్వాత హైదరాబాద్ పోలీస్ కమిషన్ నిర్వహించిన ఒక కార్యక్రమంలో సంధ్య థియేటర్ తొక్కిసలాట అంశం.. అల్లు అర్జున్ స్పందించిన తీరుకు సంబంధించిన ప్రశ్నలు విలేకరులు అడిగినప్పుడు.. అందుకు బదులుగా పది నిమిషాల నిడివి ఉన్న వీడియోను ప్రదర్శించటం ద్వారా.. అసలేం జరిగిందన్న విషయాన్ని చెప్పకనే చెప్పేశారు. ఈ వీడియోను చూసిన తర్వాత కలిగే మొదటి భావన ఏమంటే.. తొక్కలో ప్రెస్ మీట్ పెట్టమని అల్లు అర్జున్ కు సలహా ఇచ్చిందెవరు? అసెంబ్లీలో సీఎం చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ గా పుసుక్కున ప్రెస్ మీట్ పెట్టేయమని స్క్రిప్టు రాసి ఇచ్చిందెవరు? లాంటి ప్రశ్నలు మదిలో మెదలక మానవు. మొత్తంగా ఫైర్ కు వైల్డ్ ఫైర్ కౌంటర్ తెర మీద కనిపించటానికి మూడేళ్ల కసరత్తు జరిగిందన్న విషయాన్ని అల్లు అర్జున్ ఎలా మర్చిపోయారు? ఒక చిన్న పదానికి కౌంటర్ ఇవ్వటానికి మూడేళ్ల టైం తీసుకున్నప్పుడు.. ఒక రాష్ట్ర సీఎం అసెంబ్లీలో ఆన్ రికార్డుగా చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చేందుకు మూడు గంటల టైం కూడా తీసుకోకపోవటం ఏమిటి పుష్పా.

# ఇష్టపడి చదివి ఉన్నతంగా జీవించేలా లక్ష్యాలను ఏర్పరుచుకోవాలి : జేడీ లక్ష్మీనారాయణ

### 10వ తరగతి పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులను సాధించాలి

### తూంకుంటలో ట్రస్మా, ఐఎంసీటీఎఫ్ ఆధ్వర్యంలో టెన్త్ క్లాస్ విద్యార్థులకు మోటివేషన్ క్లాస్ నిర్వహించిన మాజీ జేడీ లక్ష్మీనారాయణ

శామీర్ పేట, (గరుడ వార్త) : విద్య పై మక్కువతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి పది మందికి ఆదర్శంగా జీవించాలని మాజీ జేడీ లక్ష్మీనారాయణ విద్యార్థులకు సూచించారు. సోమవారం శామీర్ పేట మండలం తూముకుంటలోని మొగుళ్ళ వెంకట్ రెడ్డి ఫంక్షన్ హాల్ లో ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హనుమంత రెడ్డి ఆధ్వర్యంలో ట్రస్మా, ఐఎంసీటీఎఫ్ సంయుక్తంగా 10వ తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు మాజీ జేడీ లక్ష్మీనారాయణ ప్రేరణాత్మకమైన మోటివేషన్ క్లాసులను నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పాఠశాలల్లో గురువులు బోధించిన పాఠ్యాంశాలను విద్యార్థులు నిత్యం క్రమశిక్షణతో చదివి పరీక్షల్లో ర్యాంకులను సాధించాలన్నారు. మొబైల్స్, ఇంస్టాగ్రామ్, రీల్స్ ప్రోగ్రాంలకు విద్యార్థులు దూరంగాఉంటు శ్రద్ధతో పరీక్షలకు సిద్ధమైతే ఉత్తమ ర్యాంకులను సాధిస్తారని తెలిపారు. విద్యార్థులు తల్లిదండ్రులు, గురువులు మెచ్చుకునేలా, సమాజం గర్వపడేలా జీవించాలని చెప్పారు. అప్పుడే ఉత్తమ పౌరులుగా రాణిస్తారని తెలిపారు. గర్వపడేలా, క్రమశిక్షణతో పరీక్షలను రాసిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ర్యాంకులను సాధించగలుగుతారని ఆయన వివరించారు. విద్యార్థులు అబ్దుల్ కలాం, పీవీ సింధు, శ్రీనివాసరామనుజన్ వంటి గొప్ప వారిని ఆదర్శంగా తీసుకున్నట్లైతే పరీక్షల్లో ర్యాంకులను సాధించి జీవితంలో




ఉన్నత స్థాయికి ఎదుగుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎంసీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రాంమూర్తి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రాములు, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్ రెడ్డి, శామీర్ పేట మండల అధ్యక్షుడు కిష్టారెడ్డి, క్రీడాభారతి కన్వీనర్ లవకుమార్, దీక్షగ్రూప్ విద్యాసంస్థల ప్రతినిదులు శివశంకర్, స్వరూప్ రెడ్డి, విజ్ఞానభారతి పాఠశాల ప్రిన్సిపల్ జంగారెడ్డి, శామీర్ పేట మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.



# నిదానంగానే యాసంగి సాగు



జగిత్యాల : అక్టోబరు 1 నుంచి యాసంగి పంటకాలం మొదలైనా ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకూ పైర్లసాగు నెమ్మదిగానే ఉన్నట్లు వ్యవసాయశాఖ తాజా నివేదిక వెల్లడిస్తోంది. సాగునీటి వనరులు పుష్కలంగా ఉన్న తరుణంలో డిసెంబరు వరకు వచ్చిందంటే అన్నిరకాల పైర్ల విస్తీర్ణం గణనీయంగా పెరగాల్సి ఉండగా ప్రస్తుతం వానాకాలం పంటల నూర్పిడి, విక్రయంలోనే రైతులు తలమునకలై ఉన్నారు.
కరీంనగర్ జిల్లాలో సాధారణంకన్నా 17 శాతం అధికవర్షం కురవగా సగటు భూగర్భ జలమట్టం 4.26 మీటర్ల కనిష్ఠ స్థాయిలో ఉంది. జగిత్యాల జిల్లాలో 20 శాతం అధిక వర్షం కురిసి భూగర్భ జలం 2.88 మీటర్లలో, పెద్దపల్లి జిల్లాలో 11 శాతం అధిక వర్షపాతంతో భూగర్భ జలం 4.15 మీటర్లలో, సిరిసిల్ల జిల్లాలో 29 శాతం అధిక వర్షంతో 5.83 మీటర్ల కనిష్ఠ లోతులో భూగర్భ జలాలున్నాయి. దీనికి తోడు ఎస్సారెస్పీ, ఎల్ఎండీ, ఎల్లంపల్లి తదితర ప్రాజెక్టులు, చెరువులన్నీ నీటితో నిండి ఉండగా యాసంగి ఆయకట్టుకు డిసెంబరు, జనవరి నుంచి ఆన్, ఆఫ్ విధానంలో నీటితడులు ఇవ్వనున్నారు. ఈ నేపథ్యంలో వరిసాగు తగ్గించాలంటున్నా సాగునీరు పుష్కలంగా ఉండటంతో ఉమ్మడి జిల్లాలో ఈ యాసంగిలోనూ వరి ప్రధాన పంటగా ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.
రాష్ట్ర ప్రభుత్వం ఆరుతడి పంటలు, కూరగాయల విత్తనాలు, వ్యవసాయ యంత్రాలను ఇస్తామన్నా ఇప్పటికీ క్షేత్రచర్యల్లేనందున రైతులు వరివైపే మొగ్గుతున్నారు. మరోవైపు పంటల బీమా అమలు చేస్తామన్నా ఇప్పటికీ నోటిఫికేషన్ వెలువరించక పైర్ల ఎంపికపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటివరకు జగిత్యాల జిల్లాలో యాసంగిసాగు 3 శాతం దాటగా కరీంనగర్, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో ఒకశాతంలోపే ఉంది. మక్క, ఆవాలు, పెసర, మినుము, వేరుసెనగ, జొన్న, సజ్జ, వేరుసెనగ, అలసంద, సెనగ వంటి పంటలను రైతులు విత్తుకోగా డిసెంబరు వరకు మక్క, పొద్దుతిరుగుడు, జనవరిలో నువ్వులు, కూరగాయలు, పెసర, మినుము తదితర పంటల సాగుకు అదనుంది. ఇప్పట్నుంచి డిసెంబరు వరకు రైతులు పెద్దఎత్తున వరినార్లు పోసేందుకు సిద్ధమవుతున్నారు. దొడ్డుగింజ రకాలను అధిక విస్తీర్ణంలో పండించనుండగా వరిలో సంకర, సూటిరకాల్లో విత్తనోత్పత్తి, మరికొందరు సన్నరకాలను పండించనున్నారు. ఈ నేపథ్యంలో డిసెంబరు నుంచి యాసంగి పైర్లసాగువిస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశముందని అంచనా వేస్తున్నారు.

# ఎరువు.. మరింత ‘బరువు’



ఖమ్మం : యాసంగి పంటల సాగు ప్రారంభించగానే కంపెనీలు మూడు రకాల ఎరువుల ధరలు పెంచి అన్నదాతలపై భారం మోపాయి. రైతులు ఎక్కువగా వాడే 20-20-013, 14-35-15, 24-24-0 కాంప్లెక్స్ రకాల ఎరువుల ధరను పెంచాయి. గత వానాకాలం సీజన్‌లో 20-20-013 బస్తా ధర రూ.1,200 ఉండగా ఇప్పుడది రూ.1,300కు చేరింది. 14-35-14 బస్తా ధర రూ.1,700 నుంచి రూ.1,800కు, 24-24-0 బస్తా ధర రూ.1,700 నుంచి 1,800కు పెరిగింది. తద్వారా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని రైతులపై అదనంగా రూ.4.50కోట్ల వరకు భారం పడనుంది.

**డాలర్ విలువ పెరగటంతో..**

అంతర్జాతీయ మార్కెట్‌లో డాలర్ విలువ పెరిగి రూపాయి విలువ పతనమవటంతో ఆ ప్రభావం ఎరువుల తయారీకి వాడే ఫాస్పారిక్ ఆమ్లం, అమ్మోనియా లాంటి ముడిసరకులపై పడింది. అందువల్లే కొన్నిరకాల కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెంచామని సంబంధిత కంపెనీల ప్రతినిధులు చెబుతున్నారు. గత సెప్టెంబర్ వరకు అంతర్జాతీయ విపణిలో టన్ను ఫాస్పారిక్ ఆమ్లం 950 డాలర్లు పలకగా ఇప్పుడు సుమారు 1,050 డాలర్లకు చేరింది.

**డీఏపీ ధరల్లో మార్పుల్లేవు**

డీఏపీ ధర పెరిగిందని ఇటీవల సామాజిక మాధ్యమాల్లో వదంతులు షికారు చేస్తున్నాయి. డీఏపీ బస్తా ధర రూ.1,350కు రైతులకు డీలర్ల ద్వారా సరఫరా చేస్తున్నామని, దీని ధర పెరగలేదని కంపెనీలు చెబుతున్నాయి. గత అక్టోబర్‌లోనే కేంద్ర ప్రభుత్వం టన్నుకు అదనంగా రూ.175 వరకు రాయితీ పెంచటంతో వచ్చే నెలాఖరు నాటికీ డీఏపీ ధర పెరిగే అవకాశం లేదని చెబుతున్నారు.

యూరియా, డీఏపీలకు లింకుల చెద

ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురవటం, సాగునీరు పుష్కలంగా ఉండటంతో రైతులు పెద్దఎత్తున యాసంగి పంటల సాగుకు పూనుకుంటున్నారు. వరి, మొక్కజొన్న పంటల వైపు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. సంబంధిత పంటలకు డీఏపీ, యూరియాలకు డిమాండ్ ఏర్పడింది. ఇదే అదనుగా కొన్ని ఎరువుల కంపెనీలు డీఏపీ, యూరియాకు దుబ్బు గుళికలు, నానో యూరియా, పొటాష్ వంటి పోషకాలను లింకు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్నాయని రిటైల్ డీలర్లు ఆరోపిస్తున్నారు. రైతులు ఎరువుల కోసం ఇబ్బంది పడకుండా, లింకులు పెట్టకుండా సరఫరా చేసేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

అవసరమయ్యే కాంప్లెక్స్ ఎరువులు (మెట్రిక్ టన్నుల్లో)
ఖమ్మం: 30,924
భద్రాద్రి: 30,372


యూరియా, డీఏపీ కావాలని అడిగిన రైతులకు లింకు మందులు అంటగడితే చర్యలు తీసుకుంటాం. యాసంగి సీజన్ ఊపందుకోలేదు. నిర్ణయించిన ధరలకు మాత్రమే రైతులకు ఎరువులు విక్రయించాలి. డి.పుల్లయ్య, డీఏఓ, ఖమ్మం

# పేరుకే ఉచిత వైద్యం.. సేవలు అంతంతమాత్రం..!

కొత్తగూడెం : పేదలకు ఉచిత వైద్యం అందించాల్సిన ప్రభుత్వాసుపత్రుల్లో సేవలు నామమాత్రంగానే లభిస్తున్నాయి. వైద్యులు, మౌలిక వసతుల కొరత వంటి సమస్యలు ఆసుపత్రులను వెంటాడుతున్నాయి. ప్రధానంగా కొత్తగూడెం సర్వజనాసుపత్రిలో అత్యవసర సమయంలో వైద్యమందించలేని పరిస్థితులు దాపురించాయి. నిత్యం 500 మందికిపైగా ఓపీ, 150 మందికి మించి ఇన్‌పేషంట్లకు సేవలందిస్తున్నప్పటికీ అత్యవసర వైద్యం కోసం ప్రైవేట్ దవాఖానాలపై ఆధారపడాల్సి వస్తోంది.

**ఎంసీహెచ్‌ను పట్టించుకుంటేనే..**

గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు మెరుగైన వైద్యమందించాలనే లక్ష్యంతో జిల్లాలో మాతాశిశు ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఆసుపత్రి ప్రారంభించిన కొత్తలో నెలకు 500కుపైగా ప్రసవాలతో గర్భిణులకు సేవలందించిన మాతాశిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లో కొంతకాలంగా వైద్యులు, సిబ్బంది కొరతతో మాసానికి 200-210




కాన్పులు మాత్రమే జరుగుతున్నాయి. ఇక్కడ ఆశించిన స్థాయిలో వైద్యమందకపోవటం వల్ల పాల్వంచ, ఇల్లెందు సీహెచ్‌సీలు, భద్రాచలం ప్రాంతీయాసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. ఎంసీహెచ్‌లో కొన్ని నెలలుగా రేడియాలజిస్ట్ లేకపోవటంతో గర్భిణులకు వైద్యపరీక్షలు కరవయ్యాయి. ఆసుపత్రికి వచ్చిన గర్భిణులు ప్రైవేటులో స్కానింగ్ చేయించుకోవాల్సి వస్తోంది. అందుకే ఆసుపత్రిలో ఓపీ తగ్గిపోయి.. ప్రసవాల సంఖ్య పడిపోతోంది.

**పడిపోయిన పీహెచ్‌సీల ర్యాంకు**

క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలు నానాటికీ తీసికట్టుగా తయారవుతున్నాయి. గత ఏప్రిల్, మే మాసాల్లో భద్రాద్రి జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉండగా.. ప్రస్తుతం 12వ స్థానానికి దిగజారటమే ఇందుకు నిదర్శనం. వైద్య సిబ్బంది కొరత, మౌలిక వసతుల కల్పనలో విఫలమవటం వల్లే పీహెచ్‌సీల ప్రమాణాలు పతనమవుతున్నాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఏఏ విభాగాల్లో పీహెచ్‌సీలు మెరుగైన ఫలితాలు సాధించటం లేదో గుర్తించి వైద్యాధికారులు దృష్టి సారించాలని కోరుతున్నారు.

**సీహెచ్‌సీల్లో మెరుగైన సేవలు**

వైద్యవిధాన పరిషత్ ఆధ్వర్యంలో పనిచేసే కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)లలో మెరుగైన సేవలందుతున్నాయి. ప్రసవాల విషయంలో ఎంసీహెచ్ కంటే భద్రాచలం ప్రాంతీయాసుపత్రి మెరుగ్గా ఉంది. మణుగూరు, ఇల్లెందు, పాల్వంచ సీహెచ్‌సీల్లో అత్యాధునిక శాస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. చర్ల, మణుగూరు, బూర్గంపాడు సీహెచ్‌సీల్లో గైనకాలజిస్ట్‌ల కొరత వేధిస్తోంది. వైద్యులను నియమిస్తే ఈ మూడుచోట్లా గర్భిణులు, బాలింతలకు మెరుగైన సేవలందుతాయి.

**అక్టోబర్‌లో జరిగిన ప్రసవాలు**

మాతాశిశు ఆరోగ్య కేంద్రం: 207
భద్రాచలం ఏరియా ఆసుపత్రి: 348
ఇల్లెందు: 46
అశ్వారావుపేట: 26
పాల్వంచ సీహెచ్‌సీ: 95

పీహెచ్‌సీ ర్యాంకుల్లో ఒడిదొడుకులు ఉంటాయి. గతంలో మొదటి స్థానంలో ఉన్నాం. ప్రస్తుతం ఎక్కడైతే విఫలమవుతున్నామో అక్కడ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి విజయవంతం చేస్తున్నాం. త్వరలోనే మొదటి స్థానానికి చేరుకుంటాం. భాస్కర్‌నాయక్, డీఎంహెచ్‌ఓ

సర్వజనాసుపత్రి, మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఇటీవల సీనియర్ రెసిడెంట్లు శిక్షణ కాలం పూర్తిచేసుకొని వెళ్లిపోయారు. ఎంసీహెచ్‌కు వచ్చే గర్భిణులను అవసరమనుకుంటేనే ఇతర ఆసుపత్రులకు పంపిస్తున్నాం. వైద్యసిబ్బంది నియామకాలు చేపడుతున్నాం. త్వరలోనేపూర్తిస్థాయిలో సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం. రాధామోహన్, సూపరింటెండెంట్, సర్వజనాసుపత్రి

# కళ్ల ముందే దర్జాగా కబ్జా!

ఆసిఫాబాద్: సర్కారీ భూములను కళ్ల ముందే కొల్లగొడుతున్నా.. ఏ అధికారికీ కనిపించదు. నిబంధనలకు విరుద్ధంగా ఏజెన్సీ భూముల్లో వెంచర్లు వెలుస్తున్నా.. వారికి పట్టదు. కాలువలను పూడ్చి ఏకంగా నిర్మాణాలు చేపడుతున్నా.. నిలువరించే ప్రయత్నాలు కానరాదు. ఈ తతంగమంతా జిల్లా ఆవిర్భావం నుంచి కొనసాగుతూనే ఉంది. బాండ్ పేపర్ల మీద రాసుకుంటూ ఈ భూములను క్రయ విక్రయా లు జరుపుతున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా భవనాలు నిర్మిస్తున్నా పుర అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. అక్రమ కట్టడాల గురించి తనిఖీల ఊసే లేకపోవడంతో ప్రజలు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆసిఫాబాద్ పట్టణం 2024న ఫిబ్రవరి 1న పురపాలికగా మారింది. ఇటీవలే కొలతలు పూర్తికాగా 20 వార్డులతో ఆసిఫాబాద్ పురపాలిక, షెడ్యూల్ ప్రాంతాన్ని రాజంపేట పంచాయతీగా ఏర్పాటు చేశారు. పుర, పంచాయతీ విస్తరించి ఉన్న ప్రాంతాల్లో డీటీసీపీ (డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్) అనుమతులు లేకుండానే వెంచర్లు వేస్తూ ప్లాట్లు విక్రయిస్తున్నారు. ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని బీడీపీపీ (బిలా దాఖల పోరంబోకు) భూములను సైతం బాండ్ పేపర్ల మీద రాసిస్తూ పలువురికి అంటగడుతున్నారు. పదుల సంఖ్యలో భవనాలు బీడీపీపీ భూముల్లో పూర్తవుతుండగా, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్‌లలో పట్టణ ప్రణాళిక అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. కాలువ పూడ్చి చదును చేశారిలా.. ఆసిఫాబాద్‌లోని అటవీ చెక్‌పోస్టు ఎదురుగా 215 ఎకరాల బీడీపీపీ ఉంది. సర్వే నంబర్ 39/ఏ, 39/బీ నాలుగు ఎకరాలు రహదారిని ఆనుకుని ఉంటాయి. ఈ భూముల మధ్య నుంచి పెద్దవాగుకు వెళ్లే ఓ కాలువ ఉంది. దీనికి సుమారు 100 అడుగుల మేర అడ్డంగా, మొరంతో పూడ్చి ఆ స్థలాన్ని మొత్తం చదును చేశారు. కాలువ ఒడ్డున ఉన్న ప్రభుత్వ స్థలం చుట్టూ సైతం ప్రహరీ నిర్మించారు. ఈ స్థలం విలువ సుమారు రూ.4 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఇవిగో అక్రమాలు..ఆసిఫాబాద్ మండలంలోని గుండి వెళ్లే మార్గంలో ఏజెన్సీ భూముల్లో ఓ వ్యక్తి వెంచర్ వేశాడు. ఇప్పటికే ప్లాట్ల వరకు అమ్ముడు కాగా, ఎలాంటి అనుమతులు లేకుండానే పదుల సంఖ్యలో భవన నిర్మాణాలు ఈ ప్రాంతంలో వెలుస్తున్నాయి. జన్కాపూర్ శివారులో పెట్రోల్‌బంక్ వెనుక ఓ నేత వెంచర్ వేశాడు. డీటీసీపీ అనుమతులు లేకుండానే ప్లాట్లు విక్రయించాడు.

## సొంత వైద్యం శ్రేయస్కరం కాదు

నల్గొండ : వైద్యుల సూచన లేకుండా సొంతంగా మాత్రలు వాడటం.. సామాజిక మాధ్యమాలపై ఎక్కువగా ఆధారపడటం శ్రేయస్కరం కాదని పలువురు వైద్యులు అభిప్రాయపడ్డారు. నల్గొండ జిల్లా కేంద్రంలోని కాకతీయ పీజీ, డిగ్రీ కళాశాలలో బాధ్యుడు రమాకాంత్ అధ్యక్షతన నిర్వహించిన ఆరోగ్య అవగాహన సదస్సుకు చక్కటి స్పందన లభించింది. జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా.మాతృనాయక్, గుండె వైద్య నిపుణులు డా.నరహరి, కంటి వైద్య నిపుణులు డా.ఏసీహెచ్ పుల్లారావు, స్త్రీ వైద్యనిపుణులు డా.వసంత కుమారి తదితరులు ఆరోగ్య సమస్యలతో పాటు జిల్లాలో లింగ నిష్పత్తి, శిశు విక్రయాలపై అవగాహన కల్పించారు. కాకతీయ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపల్ నర్సిరెడ్డి, పట్టణంలోని పలు కాలనీల వాసులు పాల్గొన్నారు. ఈసందర్భంగా సదస్సుకు హాజరైన వైద్యనిపుణులు పలువురికి పలు రకాల పరీక్షలు నిర్వహించి తగిన సూచనలు, సలహాలు అందించారు.

ఆరు నెలలకోసారి కంటి పరీక్షలు అవసరం

డా.ఏసీహెచ్.పుల్లారావు, కంటివైద్య నిపుణులు

ప్రతి ఆరు నెలలకు ఓసారి తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలి. 'ఏ' విటమిన్ లోపం కారణంగా దృష్టి లోపం వస్తుంది. దూర దృష్టి, దగ్గర దృష్టి లోపాలపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి. వయసు రీత్యా వచ్చే శుక్లాలను ముందుగా గుర్తించి జాగ్రత్తలు తీసుకోవాలి. చరవాణి ఎక్కువగా చూడడం మూలంగా కంటి చూపు మందగించే అవకాశాలున్నాయి. ఆకుకూరలతో పాటు నిత్యం గుడ్డు, పాలు, పండ్లు వంటి ప్రోటీన్లు ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలి. ఒకరు ఇచ్చే నేత్రదానం మూలంగా ముగ్గురికి కంటి చూపు వస్తుంది. యువత రక్తదానంతో పాటు అవయవదానం చేసేందుకు ముందుకు రావాలి.

లింగ నిష్పత్తి వణుకు పుట్టిస్తోంది: డా.వసంత కుమారి

జిల్లాలో లింగ నిష్పత్తి అన్ని వర్గాల్లోను వణుకు పుట్టిస్తోంది. కొన్ని మండలాల్లో ప్రతి 1,000 మంది బాలురకు 800 మంది బాలికలు మాత్రమే ఉంటున్నారు. మొదటి కాన్పు బాలిక అయితే రెండో కాన్పునకు ఇష్టపడని వారు ఉండడం విచారకరం. జీవన శైలిలో మార్పుల కారణంగా ప్రతి పది మందిని పరీక్షిస్తే ఆరుగురు పీసీఓడి సమస్యలు ఎదుర్కొంటున్నారు. రొమ్ము క్యాన్సర్లు గుర్తించడానికి సొంతంగా చేతి స్పర్శతో అవగాహన వస్తుంది. గడ్డలు, కణతులు ఉన్నట్లయితే వైద్యులను సంప్రదించి మామోగ్రఫీ పరీక్షలు చేయించుకోవడం శ్రేయస్కరం. ప్రాథమిక దశలో రోగాలు గుర్తించినట్లయితే తగిన జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంటుంది.

సదస్సు ఉపయోగకరంగా ఉందిరావుల శ్రీనివాస్‌రెడ్డి

ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆరోగ్య సదస్సు ఉపయోగకరంగా ఉంది. పట్టణ వాసులు తమ సమస్యలను వైద్యుల ద్వారా పరిష్కరించుకోగలిగారు. బీపీ, చక్కెర వ్యాధితో పాటు యూరిక్ యాసిడ్, గుండె జబ్బులు ఎలా వస్తాయి ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తెలుసుకోగలిగాను.

20 ఏళ్ల వారిలోనూ గుండె నొప్పి

డా.నరహరి, గుండెవైద్య నిపుణులు

గతంతో పోల్చితే ఈ మధ్య గుండె నొప్పి బాధితులు పెరుగుతున్నారు. 20 ఏళ్ల వయసు వారు సైతం గుండె నొప్పి బారిన పడుతున్నారు. మద్యం, మాంసాహారం, బేకరీ ఫుడ్, మానసిక ఒత్తిడి, వంశపారంపర్యం వంటి కారణాలతో చక్కెర వ్యాధి, బీపీ, హైకొలెస్ట్రాల్ ముప్పు ఏర్పడుతోంది. ఎడమ వైపు భుజం గుంజడం, ఛాతి మధ్యలో నొప్పి రావడం లక్షణాలతో గుండె నొప్పి వస్తుంది. ఈ లక్షణాలు కన్పిస్తే సమీప వైద్యుడి వద్దకు వెళ్లి ఈసీజీ తీసుకుని నిర్ధారణ చేసుకోవాలి. నిత్యం వ్యాయామం, 30 నిమిషాల యోగా, ధ్యానంతో పాటు శాకాహారం, పండ్ల రసాలు ఎక్కువగా తీసుకోవడం మంచిది. కరోనా వ్యాక్సిన్ వల్ల గుండె జబ్బులు వస్తున్నాయనే విషయంలో ఎలాంటి ఆధారాలు లేవు. నెలలో 270 అబార్షన్‌లు జరిగాయి

డా.మాతృనాయక్, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి

జిల్లాలో గడిచిన నెల రోజుల్లో 270 అబార్షన్‌లు జరిగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం ఎన్నిరకాల పథకాలు తెచ్చినా వివక్ష కొనసాగుతోంది. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో శిశు విక్రయాలు జరుగుతున్నాయి. విటమిన్ల లోపం వల్ల అన్నిరకాల రోగాలు వస్తున్నాయి. బీకాంప్లెక్స్ లోపం రాకుండా చూసుకోవాల్సిన అవసరం ఉంది. వయసుతో పనిలేకుండా టైప్-1, టైప్-2, టైప్-3 మధుమేహంతో పాటు బీపీ వస్తున్నాయి. సరైన వ్యాయామం లేకపోవడం, అర్ధరాత్రి వరకు చరవాణి చూస్తూ నిద్రలేమి, జంక్‌ఫుడ్ వంటి వాటి వల్ల రోగాలు వస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లో రోగం గురించి తెలుసుకుని సొంత వైద్యం చేసుకోవడం వల్ల కొత్త సమస్యలు కొని తెచ్చుకుంటున్నారు. వైద్యుల సూచనతో మాత్రలు వాడాలి.

చక్కెర వ్యాధి వంశపారంపర్యంగా వస్తుందా: అరవింద్

తల్లిదండ్రులకు చక్కెర వ్యాధి ఉంటే పిల్లలకు వస్తుందా? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.

దీనికి డా.మాతృనాయక్ బదులిస్తూ.. ప్రస్తుతం వయసుతో సంబంధం లేకుండా పుట్టినప్పటి నుంచే చక్కెర వ్యాధి వస్తోంది. కొన్ని సందర్భాల్లో తల్లిదండ్రుల నుంచి పిల్లలకు వచ్చే అవకాశాలు లేకపోలేదు. సందేహాలు ఉంటే వైద్యుల సూచనతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి.

బీపీ వల్ల మెడనరాలు లాగుతాయా: నవీన్‌నాకు ప్రతిరోజు మెడ నరాలు లాగుతున్నాయి. బీపీ ఉందనే అనుమానం ఉంది.డా.మాతృనాయక్ సమాధానం ఇస్తూ.. రోజూ 30 నిమిషాలు వ్యాయామం చేయడంతో పాటు 5 లీటర్ల నీరు తీసుకోవాలి. ఇక్కడే బీపీ పరీక్ష చేయించుకుంటే పరిష్కారం దొరుకుతుంది.

## అసైన్డ్ భూములు..అన్యాక్రాంతం

సంగారెడ్డి : రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు దగ్గరగా జిల్లా ఉండడం.. జిల్లా మీదుగా జాతీయ రహదారులు వెళ్లడం.. త్వరలో ప్రాంతీయ రింగ్‌రోడ్డు నిర్మాణానికి కసరత్తు సాగడం.. వంటి పరిణామాలతో స్థిరాస్తి వ్యాపారం జోరందుకుంది. భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. ఇక వ్యాపారుల, నాయకుల కన్ను అసైన్డ్ భూములపై పడింది. వాటిని విక్రయించొద్దు, కొనుగోలు చేయొద్దని నిబంధనలు చెబుతున్నా, ఎన్‌వోసీలు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. జిల్లాలో అసైన్డ్ భూములు స్వాహాపై ప్రత్యేక కథనం.ఎక్కడెక్కడ.. ఎలా.. సంగారెడ్డి పట్టణం పోతిరెడ్డిపల్లిలో 152 సర్వే నంబరులో 52 ఎకరాలు, 153 సర్వే నంబరులో 15 ఎకరాలు, 155లో 10 ఎకరాలను ఇద్దరు రాజకీయ నాయకులు రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేశారు. అనంతరం హైదరాబాద్‌కు చెందిన వ్యాపారులకు ఎకరం రూ.కోటి చొప్పున విక్రయించారు. రైతులకు మాత్రం ఒక్కొక్కరికి ఒక్కోతీరుగా చెల్లింపులు చేసినట్లు సమాచారం. రిజిస్ట్రేషన్లు లేకుండా లీజుకు ఇచ్చినట్లుగా హామీపత్రం తీసుకున్నారని పలువురు వాపోయారు. ఎన్‌వోసీ ఇవ్వడంతో సదరు భూములను వ్యాపారులు తమ పేరిట నమోదు చేసుకోవడం గమనార్హం. సంగారెడ్డి మండలం హనుమాన్‌నగర్‌లో 404సర్వే నంబరులోని మూడెకరాల అసైన్డ్ భూమిలో సగానికి పైగా స్థలంలో కొందరు ఇళ్లు నిర్మించారు. 410 సర్వే నంబరులో 10 ఎకరాల వరకు అక్రమార్కులు ప్లాట్లుగా చేశారు. గోవుల గుట్ట సమీపంలో 404/51/5 సర్వే నంబరులో ఎనిమిది ఎకరాల్లో సగానికి పైగా ఇళ్లు కట్టేశారు.

# భూతం మళ్లీ వస్తుందా..!



నల్గొండ : ఫ్లోరిన్ నీళ్లకు ఉమ్మడి నల్గొండ జిల్లా పేరు పొందింది. ఈ జిల్లాలో భూగర్భంలోని నీళ్లలో ఫ్లోరిన్ మోతాదుకు మించి ఉన్నట్టు 1945లోనే నైజాం ప్రభుత్వ వైద్య సలహాదారు పరీక్షలు నిర్వహించి గుర్తించారు. స్థానిక భౌగోళిక పరిస్థితులను బట్టి ఫ్లోరిన్ సమస్య వస్తుందని, ఇగ్రీషియస్ రాళ్లు ఈ జిల్లాలో అధికంగా ఉన్నాయని, ఆ రాతి పొరల నుంచి వచ్చే నీళ్లలో ఫ్లోరైడ్, స్ట్రాంసిన్, యురేనియం, సిలికాన్ లాంటి ప్రమాదకర మూలకాలున్నాయని పలుపరిశోధనల్లో శాస్త్రవేత్తలు గుర్తించారు. భూగర్భంలోని ఈ మూలకాలను తొలగించలేమని, ఆ నీటిని తాగకూడదని ప్రకటించారు. శరీరంలోకి చేరిన ఫ్లోరిన్‌ను సైతం తొలగించ లేమని వైద్య నిపుణులు ప్రకటించారు.


శుద్ధి చేసిన నదీ జలాలు తాగటం, ఆ నీటితో పండించిన ఆహారాన్ని, పాలను తీసుకోవడం వల్ల కొత్తగా ఫ్లోరోసిస్ వ్యాధి రాకుండా కాపాడుకోవచ్చునని సూచనలిచ్చారు. దీంతో ప్రభుత్వం మిషన్ భగీరథ ద్వారా కృష్ణా, గోదావరి జలాలను తాగునీటిగా అందిస్తున్నారు. జిల్లాలో సాగునీటి కాలువలు లేని చాలా ప్రాంతాల్లో రైతులు భూగర్భంలోకి గొట్టపు బావులను తవ్వి, అక్కడి నుంచి తోడిన నీళ్లతో పంటలు పండిస్తున్నారు. ఫ్లోరిన్ అధికంగా ఉన్న నీళ్లతో పండించినవి తినడంతో ఫ్లోరోసిస్ వ్యాధులు వస్తున్నట్టు ఇటీవల వైద్య నిపుణులు గుర్తించారు. కొన్ని రోజుల క్రితం అన్నెపర్తిలోని ఎంజీ యూనివర్సిటీలోని గొట్టపు బావుల నీటిని సేకరించి మిషన్ భగీరథ ప్రయోగశాలలో విశ్లేషించడంతో భూగర్భంలో ఫ్లోరిన్ యథాతథంగా పరిమితికి మించి ఉన్నట్టు తేలింది.

**గొట్టపు బావుల నీటిలో ఫ్లోరిన్ ఉంది..**

-వెంకటేశ్వర్లు, ఎస్‌ఈ, మిషన్ భగీరథ, నల్గొండ

మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలోని పదకొండు గొట్టపు బావుల నీటి నమూనాలను ఇటీవల సేకరించాం. వాటిని ప్రయోగశాలలో పరీక్షించాం. అన్నింటిలోనూ ఫ్లోరిన్ గతంలో మాదిరిగా పరిమితికి మించి ఉన్నట్టు తేలింది. ఈ నీళ్లు తాగేందుకు, వంటకు ఉపయోగకరం కాదు. విశ్వవిద్యాలయంలో విద్యార్థుల కోసం రోజుకు 5 లక్షల లీటర్ల శుద్ధి చేసిన భగీరథ నీళ్లను సరఫరా చేస్తున్నాం. బ్రాహ్మణవెల్లెంల, డిండి ఎత్తిపోతల పథకాల ద్వారా కృష్ణా నదీ జలాలు సరఫరా అయ్యాక భూగర్భ జలాలు పెరిగితే గొట్టపు బావుల నీళ్లలో ఫ్లోరిన్ పరిమాణం ఏమైనా తగ్గిందా అనేది మళ్లీ పరీక్షిస్తాం.

# 'సర్వే'త్రా.. సాంకే'తికమక'..!



ఖమ్మం: నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా చేపట్టిన ఇంటింటి సర్వేకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో సిగ్నల్ సమస్యతో సర్వే నిలిచిపోతుంటే.. పట్టణాల్లో సర్వర్ మొరాయిస్తుండటంతో ప్రక్రియ సాఫీగా సాగటం లేదు. సర్వే యాప్ అప్‌డేట్ అయ్యాక సర్వేయర్లు మరిన్ని ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. తొలుత ఒక్కో సర్వేయర్ రోజుకు దాదాపు 40 కుటుంబాల వరకు సర్వే చేయగా.. సాంకేతిక సమస్యలతో ఇప్పుడు 20 కుటుంబాల వివరాలు నమోదు చేయటమే గగనంగా మారింది. లబ్ధిదారుల గుర్తింపునకు నేరుగా అర్హుల ఇళ్ల వద్దే సర్వే చేపడుతుండగా.. యాప్‌లో తలెత్తుతున్న సమస్యలతో తలలు పట్టుకుంటున్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఈనెల 25 వరకు సర్వే పూర్తిచేస్తామని అధికారులు తొలుత ప్రకటించినా ప్రస్తుతం ఎదురవుతున్న ఇబ్బందులతో గడువు పెంచక తప్పని పరిస్థితి నెలకొంది.

**యాప్‌తో ఆపసోపాలు**

యాప్‌లో 14 కాలమ్స్ నింపాలి. తొలుత కొన్ని ప్రశ్నలకు సమాధానాలు పూరించాలి. సొంత ఇంట్లో ఉంటున్నారా? అద్దె ఇంట్లో నివసిస్తున్నారా? అనే వివరాలు పొందుపరచాలి. ప్రస్తుతం నివసిస్తున్న ఇంటి ఫొటోలతో పాటు ఖాళీ స్థలం కలిగి ఉంటే వాటికి సంబంధించిన పత్రాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ఖాళీ జాగా ఉందనే వివరాలు నమోదుచేశాక సంబంధిత వ్యక్తి పేరిట ఆ స్థలం ఉందా, ఇతర కుటుంబ సభ్యుల పేరిట ఉందా అన్నది పూరించాలి. డాక్యుమెంట్ వివరాలు నమోదుచేయాలి. విద్యుత్తు బిల్లు నిక్షిప్తపరచాలి. స్థలం ఫొటో, స్థలం డాక్యుమెంట్ పొందుపరచాలి. చివరగా సర్వే రిమార్క్స్‌లో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులా కాదా అన్నది రాయాలి. అయితే ఇలాంటి సమయంలో అనేకసార్లు యాప్ సర్వర్ మొరాయిస్తుండటంతో ప్రక్రియ ముందుకు సాగటం లేదు. ఒక్కో ఇంటి వద్ద గంటల కొద్దీ సర్వేయర్లు నిరీక్షించాల్సి వస్తోంది. కొన్నిచోట్ల అర్హులు అందుబాటులో ఉండటం లేదు.

**ఉభయ జిల్లాల్లో..**

ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం ఖమ్మం జిల్లాలో 3,57,869, భద్రాద్రి జిల్లాలో 2,79,638 మంది దరఖాస్తు చేశారు. వీరిలో అర్హులను తేల్చేందుకు అధికారులు సర్వేకు శ్రీకారం చుట్టారు. ఖమ్మం జిల్లాలో 586, భద్రాద్రి జిల్లాలో 481 పంచాయతీలకు కార్యదర్శులను సర్వేయర్లుగా నియమించారు. వారు లేనిచోట్ల ఇతర శాఖల సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు. ఖమ్మం నగర, పురపాలికల్లో 125 మంది చొప్పున వార్డు అధికారులు సర్వే చేస్తున్నారు. 500 కన్నా ఎక్కువ దరఖాస్తులు అందిన ప్రాంతాలకు అదనంగా సర్వేయర్లను అధికారులు కేటాయించారు. ఈనెల 7, 8 తేదీల్లో సర్వేకు సంబంధించిన ఇళ్ల గుర్తింపు ప్రక్రియ జరిగింది. ఈనెల 9 నుంచి దరఖాస్తుదారుల ఇళ్లకు సర్వేయర్లు వెళ్తున్నారు. గృహ నిర్మాణశాఖ రూపొందించిన యాప్‌లో వివరాలు నమోదుచేస్తున్నారు. పది రోజులు గడుస్తున్నా ఇళ్ల సర్వే ఆశించిన స్థాయిలో సాగటం లేదు.

సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నా సర్వే వేగంగా సాగుతోంది. ఇప్పటి వరకు ఖమ్మం జిల్లాలో 1.25 లక్షల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పూర్తయ్యింది. గ్రామీణ ప్రాంతాల్లో సిగ్నల్ సమస్యలు తలెత్తుతుండటంతో ఎక్కువ సమయం పడుతోంది. యాప్‌లో కొన్ని మార్పులు చేసి సర్వే నిర్వహిస్తున్నాం. లబ్ధిదారుల గుర్తింపు అనేది ప్రాధాన్యాంశం. ఈనెల చివరి వరకు సర్వే పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గడువులోగా సర్వే పూర్తిచేస్తాం. బి.శ్రీనివాస్, గృహనిర్మాణశాఖ ఈఈ, ఖమ్మం

# సాంకేతికతతో అక్రమాలకు అడ్డుకట్ట



సంగారెడ్డి : పురపాలికల్లో జనన, మరణ ధ్రువపత్రాల జారీలో అక్రమాలకు చెక్ పెట్టేలా ఆధునిక సాంకేతికతను వినియోగించనున్నారు. కార్యాలయానికి వెళ్లకుండానే నేరుగా ఇంటి వద్దనే తీసుకునేలా పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. గతంలో మీ-సేవ కేంద్రంలో దరఖాస్తు చేసి.. సంబంధిత పత్రాలను మున్సిపల్ కార్యాలయంలో పొందాల్సి ఉండేది. అక్కడ డబ్బులు ఇస్తేనే త్వరగా జనన, మరణ ధ్రువపత్రాలు జారీ చేస్తారనే విమర్శలున్నాయి. లేదంటే ఏదో ఒక సాకు చూపుతూ.. నెలలపాటు పెండింగ్‌లో పెడుతున్నారనే విమర్శలున్నాయి. వీటిపై పురపాలక రాష్ట్ర కార్యాలయానికి ఫిర్యాదులు వెళ్లడంతో అక్రమాలకు చెక్ పెట్టేలా కార్యచరణ చేపట్టారు.

**మంజూరు ఇలా..:** జిల్లాలో 8 పురపాలక సంఘాలున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని ఆసుపత్రిలో జనన, మరణం జరిగిన వెంటనే.. అక్కడి నుంచే సంబంధిత కుటుంబీకుల చరవాణికి లింక్ పంపించేలా ఏర్పాట్లు చేశారు. ఆ లింక్‌ను ఓపెన్ చేయగానే వివరాలు నమోదు చేయాలి. ఓటీపీ నంబర్ ఎంటర్ చేసిన తర్వాత వివరాలన్నీ వాస్తవంగా ఉంటే సంబంధిత పురపాలికకు

సమాచారం వెళ్తుంది. కమిషనర్ డిజిటల్ సంతకంతో సంబంధిత పత్రం మంజూరు చేస్తారు. మీ-సేవ కేంద్రానికి వెళ్లి జనన, మరణ ధ్రువపత్రం తీసుకోవచ్చు. నూతన విధానంతో పురపాలికల్లో జనన, మరణ పత్రాల జారీకి జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చని పలువురు భావిస్తున్నారు.

**ఏడాది దాటితే పాత విధానమే..**

పురపాలికల పరిధిలో జనన, మరణాలకు సంబంధించి ఏడాది దాటితే మాత్రం పాత విధానాన్నే అమలు చేస్తున్నారు. మొదట మీ-సేవ కేంద్రంలో దరఖాస్తు చేయాలి. అనంతరం ఆర్‌డీవో ప్రొసీడింగ్స్‌కు దరఖాస్తు వెళుతుంది. దీనికి మూడు నెలల సమయం పడుతుంది. ఆ తర్వాత జనన, మరణ ధ్రువపత్రం కోసం పురపాలక కార్యాలయంలో దరఖాస్తు చేయాల్సి ఉంటుంది.

## వంతెన కల నెరవేరేదెలా?

పెద్దపల్లి: గోదావరి నది, మానేరు వాగుల నడుమ జిల్లా విస్తరించి ఉండటంతో ప్రజలకు వంతెనల ఆవశ్యకత ఏర్పడింది. పొరుగు జిల్లాల్లోని పలు ప్రాంతాలకు వెళ్లడానికి వారధులు లేకపోవడంతో గ్రామీణులు ఆర్థిక, దూరాభారాలతో ఇబ్బందులు పడుతున్నారు. వంతెనలు లేని గ్రామీణ ప్రాంతాల్లో ఎండకాలం మినహా మిగతా కాలాల్లో రైళ్లు, బస్సుల్లో వారి గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. గోదావరిపై గోదావరిఖని, రాయపట్నం, కాళేశ్వరం వద్ద గల వంతెనలు.. సుందిల్ల, ఎల్లంపల్లి బ్యారేజీలు జిల్లావాసులు మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ జిల్లాలకు వెళ్లేందుకు ఉపయోగంగా ఉన్నాయి. జిల్లాలో మరో ప్రధానమైన యేరు(మానేరు)పై మూడు వంతెనలున్నాయి. మానేరు వాగు గ్రామీణ ప్రాంతాల గుండా ప్రవహిస్తుండటంతో ఆయా గ్రామాల ప్రజలు వంతెనల కోసం నేతల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు. ఇటీవల ఓదెల మండలం రూప్‌నారాయణపేట వద్ద మానేరుపై రూ.80 కోట్ల అంచనా వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వం వంతెన నిర్మాణానికి పచ్చజెండా ఊపడంతో మరికొన్ని గ్రామాల్లో కూడా వంతెనల నిర్మాణానికి ప్రజల నుంచి డిమాండ్ పెరిగింది. కాగా కొన్ని ప్రాంతాల్లో వంతెనలు ఉన్న పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో అవి పూర్తిస్థాయిలో వినియోగంలోకి రావడం లేదు. అలాంటి వాటిపై కథనం.

నెరవేరని స్పీకర్ హామీ

కాల్వశ్రీరాంపూర్ మండలం కిష్టంపేట వద్ద మానేరుపై వంతెన నిర్మాణా



నికి అప్పటి శాసనసభ స్పీకర్ మధుసూధనాచారి హామీ ఇచ్చారు. భూపాలపల్లి జిల్లా టేకుమట్ల నుంచి మానేరులో నిర్మించిన తాత్కాలిక మట్టిరోడ్డుపై కిష్టంపేట వరకు ద్విచక్రవాహనంపై ఆయన వచ్చి వంతెన నిర్మాణం కోసం కృషి చేస్తానని ప్రజలకు భరోసా కల్పించారు. కానీ ప్రభుత్వం మారడంతో వంతెన హామీ వరకే ఆగిపోయింది.

గాలికి కూలిన వంతెనముత్తారం మండలం ఓడెడ్ సమీపంలో రూ.25 కోట్ల అంచనా వ్యయంతో 2016లో వంతెన నిర్మాణ పనులు చేపట్టారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే భూపాలపల్లి వెళ్లేందుకు సమీప ప్రజలకు ఇబ్బందులు తీరుతాయి. కానీ వంతెన పలు సందర్భాల్లో వరదలకు కొట్టుకుపోవడం, గాలులకు పడిపోవడం జరిగింది. నిర్మాణ వ్యయం రూ.50 కోట్లకు పెరిగినప్పటికి నాణ్యత లోపాలతో వంతెన నిర్మాణం కలగానే ఉంది.

అప్రోచ్ రోడ్డు లేక నిరుపయోగం

సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల, మానకొండూర్ మండలం వేగురుపల్లి మధ్య మానేరుపై 2016లో రూ.20 కోట్లతో వంతెన నిర్మించారు. కానీ దీనిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడంలో పాలకులు విఫలమయ్యారు. వంతెనకు ఇరువైపులా ప్రభుత్వం అప్రోచ్ రోడ్లు నిర్మించకపోవడంతో స్థానికులే రోడ్డు వేసుకున్నారు. ఈ వంతెనపై నుంచి ద్విచక్ర, త్రిచక్ర వాహనాలతో పాటు కార్లు ఇతర వాహనాలు మాత్రమే వంతెనను వినియోగించుకుంటున్నాయి.

## పశువైద్యం.. దైన్యం..!

మేళ్లచెరువు : ప్రభుత్వ పశు వైద్యశాలల్లో జీవాలకు ఉచిత వైద్యంతోపాటు మందులు పంపిణీ చేయాల్సి ఉంది. అవేమి అందక పాడి రైతు సొంతంగా ఖర్చు చేసి పశువులకు వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అరకొరగా మందుల పంపిణీ జరుగుతుండటంతో బయట కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఔషధాలు సరఫరా అవుతున్నా రైతుల దరి చేరడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

రోగ నిర్ధారణ పరీక్షలు కరవు

ఉమ్మడి నల్గొండ జిల్లాలో 5,39,406 పశువులు ఉన్నాయి. వీటికి సంబంధించి మందులు ఉచితంగా పంపిణీ చేయాల్సి ఉంది. ఇవి ప్రభుత్వం నుంచి సరఫరా అవుతున్నా పాడిరైతులకు మాత్రం అందటం లేదు. పశువులకు రోగ నిర్ధారణ పరీక్షలు కూడా చేయడం లేదు. ఏమైనా రోగాలొస్తే సొంతంగా మందులు తెచ్చుకొని చికిత్స చేయించుకుంటున్నామని పెంపకందారులు చెబుతున్నారు. సిబ్బంది కొరత కారణంగా పరీక్షల నిర్వహణలో కొంత ఇబ్బందులు ఎదురవుతున్నాయంటూ అధికారులు దాటవేస్తున్నారు.

రవాణా భారం ఉమ్మడి నల్గొండ జిల్లాలో పశువైద్యశాలకు సంబంధించిన అంబులెన్సులు ఎక్కడా లేవు. ఉమ్మడి జిల్లాలో 277 పశు వైద్యశాలలు ఉన్నాయి. వీటికి ఒక్క అంబులెన్సు కూడా కేటాయించలేదు. దీంతో పశువులకు ఏమైనా చికిత్స అవసరమొస్తే మండల




కేంద్రాలకు తీసుకెళ్లడానికి పాడిరైతులు నానా తంటాలు పడుతున్నారు. సొంతంగా వాహనాలను సమకూర్చుకొని తరలిస్తున్నారు.

బయట కొనమంటున్నారు

నాగిరెడ్డి, పాడిరైతు, మేళ్లచెరువు

పాడి గేదెలు అనారోగ్యానికి గురైతే పశువుల ఆసుపత్రికి తీసుకెళ్లేవాళ్లం. అక్కడ ఒకటి రెండు మందులు ఇచ్చి మిగతావి బయట కొనుక్కోమనేవాళ్లు. ఒక్కోసారి అవి కూడా లేవని చెబుతున్నారు. ప్రభుత్వం ఇవ్వడం లేదని సమాధానమిస్తున్నారు. ఇలాంటప్పుడు ఆసుపత్రికి ఎందుకని బయటనే వైద్యం చేయిస్తున్నాం.

ప్రతిపాదనలు పంపిస్తాంశ్రీనివాసరావు, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి, సూర్యాపేట జిల్లాలో పశువైద్యశాఖకు సంబంధించిన అంబులెన్సు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తాం. అక్కడి నుంచి ఉత్తర్వులు రాగానే ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. సంచార వాహనాలతో రైతుల వద్దకు వెళ్లి చికిత్స అందిస్తున్నాం.

# నీటి కష్టాలు లేకుండా.. వేసవి గడిచేలా

హైదరాబాద్ : మహానగరంలో వేసవి నీటి కష్టాలకు ముందస్తు ప్రణాళికతో చెక్ పెట్టేలా జలమండలి కార్యాచరణ సిద్ధం చేస్తోంది. వేసవిలో భూగర్భజలాలు పడిపోవడంతో జలమండలి సరఫరా చేసే ట్యాంకర్లపై ప్రభావం పడింది. ప్రధానంగా 6,9,15,18 జలమండలి డివిజన్లలోని పలు ప్రాంతాలతో పాటు కుత్బుల్లాపూర్ ప్రాంతంలో తీవ్రమైన నీటి ఎద్దడి ఏర్పడింది. జలమండలి నీటి ట్యాంకర్లకు భారీగా డిమాండ్ వచ్చిన ప్రాంతాలను పూర్తిగా మ్యాపింగ్ చేశారు. అక్కడ ట్యాంకర్లకు డిమాండ్ ఎందుకు ఏర్పడింది? సరఫరాలో ఉన్న సమస్యలు సహా పలు అంశాల ఆధారంగా ప్రత్యేకంగా ముందస్తు ప్రణాళిక సిద్ధమవుతోంది. ప్రస్తుతం జలమండలి రోజుకు సగటున 570 ఎంజీడీల నీటిని నిత్యం సరఫరా చేస్తోంది. వేసవిలో డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని అదనంగా మరో 10 ఎంజీడీలు సరఫరా చేసేందుకు



ప్రాథమికంగా గుర్తించారు.

**పెరిగిన వర్షపాతంతో ఊరట..** నగర పరిధిలో నైరుతిలో సాధారణ వర్షపాతం 615 మిల్లీమీటర్లు కాగా ఈ సారి 825 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తిరుమలగిరి ప్రాంతంలో మాత్రం సాధారణ వర్షపాతం కంటే 20శాతం తక్కువ నమోదైంది. ఆ ప్రాంతంలో ట్యాంకర్లకు వేసవిలో డిమాండ్ ఎక్కువుండే అవకాశం ఉండటంతో అక్కడ ప్రత్యేక దృష్టి సారించాలని భావిస్తున్నారు.

**గతేడాది భారీగా పెరిగిన ట్యాంకర్ల వినియోగం..**

మార్చి, ఏప్రిల్, మే, జూన్, జులై నెలల్లో గతంలో ఎన్నడూ లేనంతగా జలమండలి ట్యాంకర్లకు డిమాండ్ ఏర్పడింది. సగటున ప్రతి నెలా లక్షకుపైగా ట్యాంకర్లకు డిమాండ్ వచ్చింది. ఏప్రిల్‌లో గత ఆరేళ్లలో లేనివిధంగా రికార్డు స్థాయిలో 1.74 లక్షల ట్యాంకర్లు బుక్ చేశారు. ఇది అంతకుముందు ఏడాది ఏప్రిల్ నెల ట్యాంకర్ల డిమాండ్‌కు రెట్టింపు ఉండటం గమనార్హం. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రాంతాల వారీ ట్యాంకర్ల డిమాండ్‌ను విశ్లేషించి తదనుగుణంగా రానున్న వేసవిలో ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు జలమండలి ఉన్నతాధికారులు వివరించారు.

# మహిళా సంఘాలు.. ఆర్థికాభ్యున్నతికి అడుగులు

కరీంనగర్ : కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం అడుగులేస్తోంది. ఆ దిశగా స్వశక్తి సంఘాలకు ఇచ్చే బ్యాంకు లింకేజీ రుణాలపై లక్ష్యాన్ని సాధించేలా నగర, పురపాలికల్లో అధికారులు చర్యలు చేపట్టారు.

జిల్లాలో కరీంనగర్ నగరపాలికతోపాటు నాలుగు మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటిలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బ్యాంకు లింకేజీ వంద శాతం లక్ష్యం సాధించేలా చర్యలు చేపట్టారు. గతేడాది 170 శాతానికి పైగా రుణాలు అందించి ఎక్కువ మంది లబ్ధిదారులను ఆర్థికంగా ఆదుకున్నారు. ప్రభుత్వం కూడా మహిళా సంఘాల సభ్యుల ఆర్థికాభ్యున్నతికి కృషి చేయాలని నిర్ణయించడంతో ఎక్కువ మందికి లబ్ధి జరిగేలా యూనిట్లు స్థాపించడం, రుణాలు అందేలా చూడాలని భావిస్తున్నారు.

**వ్యక్తిగత, గ్రూపులకు ప్రాధాన్యం**

బ్యాంకు లింకేజీ ద్వారా రుణాలు తీసుకోవాలంటే ముందుగా స్వశక్తి సంఘాలు ఆరు నెలల వరకు క్రమం తప్పకుండా పొదుపు చేయాలి. మొదటి సంవత్సరం రూ.75 వేలు రుణం అందిస్తుండగా ఆ తర్వాత రూ.లక్ష నుంచి మొదలుకొని రూ.20 లక్షల వరకు రుణాలు తీసుకోవడానికి అవకాశముంటుంది. మహిళా సంఘాల్లో వ్యక్తిగత వ్యాపారాలు చేసుకోవడానికి, సమష్టిగా పెద్ద సంస్థలు ఏర్పాటు చేసుకొని వ్యాపారాన్ని వృద్ధి చేసుకోవడానికి ఈ బ్యాంకు లింకేజీ వీలుంటుంది. కొత్తగా వ్యాపారం ప్రారంభించుకోవడానికి, పాత వ్యాపారాన్ని అభివృద్ధి చేసుకోవడానికి కూడా అందిస్తున్నారు.

**ప్రజాపాలన సంబరాల్లో భాగస్వామ్యం**

ప్రభుత్వ ప్రజాపాలన సంబరాల్లో మహిళలను భాగస్వాములు చేసేలా కార్యాచరణ తీసుకున్నారు. మహిళా సంక్షేమం, అభివృద్ధి ఫలాలు, రుణాలను వివరించనున్నారు. రుణాలు సైతం అందించనున్నారు. కరీంనగర్ నగర పరిధిలో 65 గ్రూపులకు రూ.12 కోట్ల రుణాన్ని పంపిణీ చేయనున్నారు. వీధి వ్యాపారులకు ఇప్పటి వరకు రూ.10 వేలు, రూ.20 వేలు ఇచ్చారు. దీనిని రూ.50 వేలకు పెంచి రుణాలు మంజూరు చేస్తున్నారు. మొత్తం 38 మందికి రూ.19 లక్షలు అందించనున్నారు. ఇందిరా మహిళా శక్తి కింద 14 గ్రూపులకు రూ.1.95 కోట్లు అందించనున్నారు.

# అయిదు ఇసుక రీచ్‌ల గుర్తింపు

మెట్‌పల్లి : జిల్లాలో ఇసుక అవసరాల కోసం అధికారులు అయిదు రీచ్‌లను గుర్తించారు. ఇసుక అవసరమైన వారికి 'మన ఇసుక వాహనం' పోర్టల్ ద్వారా గుర్తించిన రీచ్‌ల నుంచి సరఫరా జరిగేలా నిర్ణయించారు. మెట్‌పల్లి, మల్లాపూర్, రాయికల్, కథలాపూర్, కోరుట్ల మండలాల్లోని పెద్దవాగుపై ఇసుక రీచ్‌లను గుర్తించి ఇక్కడి నుంచి జిల్లా పరిధిలో ఇసుక సరఫరా జరిగేలా చూడనున్నారు. భూగర్భ జలశాఖ, రెవెన్యూ, నీటిపారుదల, మైనింగ్ శాఖల జిల్లాలో పది చోట్ల ఇసుక రీచ్ ఏర్పాటు కోసం పరిశీలించారు. అయిదు చోట్ల ఇసుక రీచ్‌ల ఏర్పాటుకు అనువుగా ఉందని గుర్తించారు. కోరుట్ల మండలం పైడిమడుగు, కథలాపూర్ మండలం సిరికొండ, రాయికల్ మండలం ఇటిక్యాల, మల్లాపూర్ మండలం సాతారం, మెట్‌పల్లి మండలం ఆత్మకూర్ పెద్దవాగుల్లో ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేసి 33,907.26 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని గుర్తించారు. 'మన ఇసుక వాహనం' కింద నమోదు చేసుకున్న ట్రాక్టర్ల ద్వారా ఇసుక సరఫరా చేసేందుకు నిర్ణయించారు. ఇసుక చేర్చే దూరాన్ని బట్టి కిలోమీటర్ల వారీగా రుసుము నిర్ణయించారు.

# ఎటూ తేలని ముంపు పంచాయతీలు



గజ్వేల్: గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం ప్రభుత్వం ఒక్కో ప్రక్రియను పూర్తి చేస్తున్నప్పటికీ గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన మల్లన్నసాగర్ ముంపు గ్రామాలపై ఇంకా ఎలాంటి నిర్ణయం వెలువడకపోవటం చర్చనీయాంశంగా మారింది. ఈ గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేస్తారంటూ కొందరు, పంచాయతీలుగానే కొనసాగిస్తారని మరికొందరు చర్చలు సాగిస్తున్నారు. ఇంతవరకు ప్రభుత్వపరంగా ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ఈ ముంపు గ్రామాల ఓటరు ముసాయిదా ఇంకా వెలువడకపోవటం గమనార్హం.

**ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ**

సాగు, తాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసమని గత ప్రభుత్వం గజ్వేల్-దుబ్బాక నియోజకవర్గాల మధ్య మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్మించింది. 14 గ్రామాల వరకు పూర్తిగా ముంపునకు గురయ్యాయి. తొగుట మండలం ఏటిగడ్డకిష్టాపూర్, పల్లెపహాడ్, బంజేరుపల్లి, లక్ష్మాపూర్, వేములఘాట్, తండా, కొండపాక మండలం సింగారం, ఎర్రవల్లి గ్రామాలను గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పురపాలిక పరిధిలో సంగాపూర్, ముట్రాజ్‌పల్లి గ్రామాల మధ్య దాదాపు 600 ఎకరాల్లో పునర్ నిర్మించారు. 2020-21 నుంచి ముంపు గ్రామాల ప్రజలు ఇక్కడే నివసిస్తున్నారు. అన్ని గ్రామాల జనాభా ప్రస్తుతం 15 వేలకు పైగా ఉంది. ఇందులో గత ఎన్నికల లెక్కల ప్రకారం 13 వేల వరకు ఓటర్లున్నారు. మొన్నటి వరకు గ్రామ పంచాయతీలను తాత్కాలిక భవనాల్లో కొనసాగించారు. పదవీ కాలం ముగిసిపోవటంతో ప్రభుత్వం ప్రత్యేక అధికారుల పర్యవేక్షణలతో పాలన కొనసాగుతోంది.

**కొత్త మండలం చేస్తారా?**

గజ్వేల్ మండల రెవెన్యూ పరిధిలోని స్థలాల్లో ఊళ్లను నిర్మించిన నేపథ్యంలో వాటిని గ్రామ పంచాయతీలుగా కొనసాగించాలంటే భౌగోళికంగా రెవెన్యూ శాఖ సబంధిత సర్వే నంబర్లను డీనోటిఫై చేయాల్సి ఉంటుంది. తరువాత వాటిని ఆయా గ్రామాల పేరుతో నోటిఫై చేయాలి. ఈ దిశగా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు ప్రారంభించలేదు. ఎప్పుడు చేస్తారు? అనేదానిపైనా స్పష్టమైన ఆదేశాలు లేవు. ముంపునకు గురైన గ్రామాల పేరుతోనే కొనసాగించాలంటే 'గజ్వేల్ అర్బన్' మండలం కొత్తగా చేసిన తరువాత గ్రామాల పేర్లను వాటితో కలుపుతారని ఓ చర్చ సాగుతోంది. ప్రస్తుతం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పురపాలికలో 20 వార్డులున్నాయి. 55 వేల జనాభా ఉంది. ముంపు గ్రామాలను బల్దియాలో కలిపితే దాదాపు మరో 10 వార్డుల వరకు అదనంగా పెరిగి 30 వార్డులకు పైగా పెరిగే అవకాశం ఉంది.

**ప్రభుత్వం నిర్ణయిస్తే ప్రక్రియ చేపడతాం - మను చౌదరి, జిల్లా కలెక్టర్**

మల్లన్నసాగర్ ముంపు గ్రామాలను పంచాయతీలుగానే కొనసాగించాలని ప్రభుత్వానికి గతంలోనే ప్రతిపాదనలు పంపించాం. పంచాయతీలుగా కొనసాగించాలా? లేక మున్సిపాలిటిలో విలీనం చేయాలా? అనేదానిపై ఇంత వరకు ఎలాంటి అధికారిక ఆదేశాలు రాలేదు. పంచాయతీలుగా కొనసాగించాలని ప్రభుత్వం నిర్ణయిస్తే రెవెన్యూ పరంగా శాఖపరమైన ప్రక్రియ చేపడుతాం.

# సిండికేట్ అయ్యారా? బిల్లులు జాప్యం అవుతాయనా?




హుస్నాబాద్: హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ మండలాల్లో నిధులు మంజూరైన పనులకు టెండర్లు పిలవగా గుత్తేదార్లు ముందుకు రాలేదు. అధికారులు మరోసారి టెండర్లు పిలిచి జనవరి 3వ తేదీని గడువుగా నిర్ణయించారు. అధ్వాన స్థితిలో ఉన్న పంచాయతీ రాజ్ రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయి. నవంబరులో నిర్వహించిన ఆన్‌లైన్ టెండరుకు ఎవరూ వేయలేదు. ఆసక్తి ఉన్న గుత్తేదార్లు టెండర్లు వేయడానికి గత నవంబరు 20 గడువు నిర్ణయించారు. ఆ గడువుకు ఎవరూ టెండరు వేయలేదు. ఇంజినీరింగు అధికారులు మళ్లీ నిర్వహిస్తున్నారు.

**కొత్త సంవత్సరంలో తేలేనా!**

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు లభించడమే గగనంగా ఉన్న పరిస్థితుల్లో పనులు చేపట్టేందుకు గుత్తేదార్లు ముందుకు రాకపోవడం గమనార్హం. గుత్తేదార్లు ముందుకు రాకపోవడానికి వివిధ కారణాలు ఉన్నాయనే భావన వ్యక్తం అవుతోంది. ఈ పనులు చేస్తే బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం కావచ్చని కొందరు ముందుకు రావడం లేదని చెబుతున్నారు. మరోవైపు గుత్తేదార్లు సిండికేట్ కావడం వల్ల ఎవరూ ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. టెండర్లలో పనులు చేపట్టడానికి గుత్తేదార్లు జిల్లాలను కేటాయించుకున్నట్లు సమాచారం. ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, పురపాలికల పనులను కేటాయించుకున్న విధంగా వారు మాత్రమే వేస్తున్నారు. ఈ పరిస్థితి కొన్నేళ్లుగా కొనసాగుతోంది. ఈ కారణంగానే ప్రస్తుతం దాఖలు కాలేదని చర్చించుకుంటున్నారు. ఈ విషయమై పీఆర్ డీఈఈ మహేశ్‌ను సంప్రదించగా టెండరు దశలో ఉన్నాయని తెలిపారు. జనవరిలో టెండరు ప్రక్రియ పూర్తికాగానే పనులు ప్రారంభిస్తామన్నారు.

పనులు జరగాల్సిన మండలాలు - 3
రహదారులు, వంతెనల పనులు - 16
మంజూరైన గ్రాంటు నిధులు - రూ.15.04 కోట్లు
5.5 కి.మీ. పందిల్ల-పొట్లపల్లి-హుస్నాబాద్ రెండు వరుసల రోడ్డు - రూ.3.95 కోట్లు
తోటపల్లి-పూసవర్లపల్లి మధ్య వంతెన - రూ.1.49 కోట్లు
కోహెడ-కూరెల్ల-తంగళ్లపల్లి చౌరస్తా - రూ.1.55 కోట్లు
తీగలకుంటపల్లి-శ్రీరాములపల్లి - రూ.1.50 కోట్లు
అక్కన్నపేట-సంజీవరాయ కాలనీ - రూ.1.40 కోట్లు
పీడబ్ల్యూడీ రోడ్డు, చౌటపల్లి, మల్లంపల్లి దారి పనులు - రూ.1 కోటి
జడ్పీ రోడ్డు, పరికిబండ మార్గం - రూ.50 లక్షలు
మూడు మండలాల్లో ఇతర పనులు - రూ.3.65 కోట్లు

# పదిరోజులే గడువు.. పడతలేదు అడుగు



హుజూర్‌నగర్: రూ.కోట్ల విలువ చేసే ధాన్యం ఇవ్వాల్సి ఉన్నా స్పందన లేకపోవడంతో ప్రభుత్వానికి వేలం ధాన్యం వసూలు చేయడం పెద్ద సమస్యగా మారింది. సూర్యాపేట జిల్లాలో కేవలం 14 శాతం మాత్రమే వసూలు కాగా.. నల్గొండ జిల్లా నుంచి 54 శాతం, యాదాద్రి భువనగిరి జిల్లాలో 65 శాతం మిల్లర్లు అప్పగించారు.

వేలం వేసిన ధాన్యం గుత్తేదారుకు అప్పగించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నా మిల్లర్ల నుంచి స్పందన లేదు. మిల్లర్లు తీసుకున్న సీఎంఆర్ ధాన్యాన్ని ప్రభుత్వం వేలం వేసిన సంగతి తెలిసిందే. ఆ ధాన్యం డిసెంబరు 31 వరకు అప్పగించాలని గడువు విధించినా కొండలా ఉన్న లక్ష్యం మాత్రం కదలడం లేదు. గడువులోగా ఇవ్వకుంటే 25 శాతం జరిమానా విధించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నా మిల్లర్లు వేలం ధాన్యం ఇచ్చేందుకు ముందుకు రావడం లేదు. పది రోజులే గడువున్నా నామమాత్రంగానే అప్పగించారు. ఈ ధాన్యం రాబట్టడం ప్రభుత్వానికి సవాలుగా మారింది. మరో వైపు వేలం వేసిన ధాన్యం తమకు అప్పగిస్తేనే ప్రభుత్వానికి ఇవ్వాల్సిన వేలం బాకీ చెల్లిస్తామని గుత్తేదారు అంటున్నాడు.

**పది నెలలుగా ఇదే తంతు..**

యాసంగిలో 2022-23 సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా కొన్న ధాన్యాన్ని మిల్లులకు కేటాయించారు. వర్షాలు పడటం, ధాన్యంలో నాణ్యత లేదని తాము సీఎంఆర్ పెట్టలేమని మిల్లర్లు చేతులెత్తేశారు. ప్రభుత్వం ఆ ధాన్యాన్ని టెండరు ద్వారా 11 నెలల క్రితం వేలం వేసింది. అమ్మిన ధాన్యం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ మిల్లుల్లో ఉంది. కొందరు మిల్లర్లు ధాన్యం అప్పగించారు. కొందరు గుత్తేదారు కోట్ చేసిన ధరను నగదు రూపంలో చెల్లించారు. ఎక్కువ సంఖ్యలో మిల్లర్లు గుత్తేదారుకు అప్పగించేందుకు రకరకాలుగా కొర్రీలు పెడుతూ వస్తున్నారు. అధికారుల లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలో 7,89,275 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ ధాన్యాన్ని వేలం వేసింది. దక్కించుకున్న గుత్తేదారు 3,28,545 మెట్రిక్ టన్నులు మాత్రం స్వాధీనం చేసుకున్నారు. ఇంకా 4,60,730 మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్ల దగ్గరే ఉంది.

**రకరకాలుగా కొర్రీలు**

మిల్లుల్లో ధాన్యం ఉంటే వెంటనే అప్పగించాలని లేదా మిల్లర్లు గుత్తేదారు డబ్బు చెల్లించాలన్నారు. ఈ షరతుతో ఇప్పటికే కొందరు మిల్లర్లు నగదు చెల్లించగా, ఇంకొందరు తమ వద్ద ఉన్న ధాన్యాన్ని అప్పగించారు. ఎక్కువ మంది మిల్లర్లు స్పందించడం లేదు. మిల్లుల్లో దీర్ఘకాలం నిల్వ చేయటం వల్ల అవి పూర్తిగా నాణ్యత కోల్పోయాయని, వాటిని కాంట్రాక్టరు తీసుకోవడం లేదని కొందరు అంటున్నారు. కొన్ని మిల్లుల్లో ప్రభుత్వం సీఎంఆర్ ధాన్యం వేలం వేసే సమయానికే ధాన్యం అమ్ముకున్నట్లు సమాచారం.

# మారాలి మనం.. కేరళలా..!

సూర్యాపేట : ఈ తరుణంలో దేశంలోనే అక్షరాస్యతలో మొదటి స్థానంలో ఉన్న కేరళ అనుసరిస్తున్న విధానాలతోనే సర్కారు పాఠశాలలు బలోపేతం చేయవచ్చని విద్యారంగ విశ్లేషకులు అభిప్రాయపడు తున్నారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటంతో గ్రామీణ ప్రాంతాల వారు సైతం పట్టణాలకు బస్సుల్లో తమ పిల్లల్ని పంపుతుండగా సంఖ్య తగ్గిపోతుంది. మరోవైపు గురుకులాలు, కేజీబీవీ, మైనార్టీ విద్యా సంస్థల్లో పోటీ పరీక్షలు రాసి నిరుపేద విద్యార్థులు చేరుతున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చేరికల సంఖ్య ఏటా తగ్గిపోతోంది.

గతేడాదితో పోల్చితే ఈ ఏడాది భువనగిరి జిల్లా వ్యాప్తంగా 3,151 మంది విద్యార్థుల సంఖ్య ప్రభుత్వ పాఠశాలలో తగ్గిపోయింది.

సూర్యాపేట జిల్లాలో గతేడాదితో పోల్చితే ఈ విద్యా సంవత్సరం 4,522 మంది విద్యార్థుల సంఖ్య తగ్గిపోయింది.

కేరళ విద్యారంగం విధానాలు మచ్చుకు కొన్ని...

దేశంలోనే మొదటిసారి 2007లో ఈ సూచనలను కేరళ వంద శాతం అమలు చేసి విజయం సాధించింది.

20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడిని నియమించారు.

5 కిలోమీటర్లను యూనిట్‌గా తీసుకుని ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేశారు. అన్ని వసతులు, తరగతి గదులు కల్పించారు.




కేరళలో 40వేల జనాభా దాటిన చోట ఒక్క ప్రైవేట్ పాఠశాలకు మాత్రమే అనుమతిని ఇస్తున్నారు. ఐదంచెల విధానంలో తనిఖీ చేసిన తరువాతే ప్రైవేట్ పాఠశాలకు అనుమతి ఇస్తూ పూర్తిగా నియంత్రించారు. కేరళలో 80 శాతం ప్రభుత్వ పాఠశాలలు, 10 శాతం మిషనరీ, ఎయిడెడ్ విద్యాసంస్థలు ఉండగా కేవలం 10 శాతం మాత్రమే ప్రైవేట్ పాఠశాలలున్నాయి.

'తల్లిదండ్రులు, టీచర్స్ అసోసియేషన్' ఏర్పాటు చేసి..వారికి పూర్తి అధికారాలు ఇచ్చారు. ప్రతి 2 నెలలకు సమావేశం ఏర్పాటు చేసుకుని పాఠశాల అభివృద్ధిపై నిర్ణయాలు తీసుకుని అమలు చేస్తారు.

ప్రతి ఎమ్మెల్యే, ఎంపీ తమ నిధులలో 50 శాతం ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కల్పనకే ఖర్చుచేయాల్సి ఉంటుంది.

పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి డీఈవోకు ఉండే అధికారాలు కల్పించారు. క్రమశిక్షణ పాటించని ఉపాధ్యాయులను సస్పెన్షన్‌తో పాటు సర్వీసు నుంచి తొలగించే అధికారాలు ఉంటాయి.

జాతీయ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ) 2005లో విద్యారంగ ప్రమాణాల పెంపునకు గాను 2005 జాతీయ పాఠ్యపుస్తకాల నిర్ణయ సంస్థను ఏర్పాటు చేసింది. ఈ సంస్థ ఆయా రాష్ట్రాలలో పూర్తి అధ్యయనం తరువాత ప్రాంతీయ భాషకు, మాతృభాషకు ప్రాధాన్యం ఇవ్వాలని, సామాజిక స్థితిగతులు, స్థానిక పరిస్థితులను పాఠ్యాంశాలలో చేర్చాలని సూచించారు. దీన్ని అన్ని రాష్ట్రాల్లో అమలుకు ఆదేశించారు.

# సమీకృతం.. సగం సగం..!

నల్గొండ : పురపాలికల్లో సమీకృత మార్కెట్ల నిర్మాణం అటకెక్కింది. గత ప్రభుత్వం కూరగాయలు, మాంసాహారం తదితరాలు అన్నీ ఒకేచోట విక్రయాలు జరగాలని భావించి సమీకృత మార్కెట్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. వాటి నిర్మాణానికి నిధులు మంజూరు చేసింది. ఉమ్మడి జిల్లాలో సూర్యాపేట, నల్గొండ మినహా అంతటా పనులు పడకేశాయి. పునాదులకే పరిమితమయ్యాయి. కేటాయించిన నిధులు కూడా మంజూరు కాక నిర్మాణం కలగానే మారింది. పూర్తయిన రెండు చోట్ల ఉత్సవ విగ్రహాలుగా మారాయి. రూ.కోట్లు కేటాయించినా నిష్ఫలం కావడంతో పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**ఆరుబయటే విక్రయాలు**

సూర్యాపేటలో పాత వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ.30.18 కోట్ల నిధులతో సమీకృత మార్కెట్ నిర్మాణం చేపట్టారు. గతేడాది నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించారు. ప్రారంభించినప్పటి నుంచి నేటి వరకు వ్యాపారులు అక్కడ విక్రయాలు చేపట్టడం లేదు. ఆరుబయటనే తమ క్రయవిక్రయాలు చేపడుతున్నారు.

**నల్గొండలో నిరుపయోగంగా..**

నల్గొండలో రూ.8 కోట్లతో నిర్మించిన సమీకృత మార్కెట్ నిరుపయోగంగా మారింది. అసెంబ్లీ ఎన్నికల ముందు అప్పటి మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించారు. కానీ ఇప్పటి వరకు వ్యాపారులకు దుకాణాలు కేటాయించలేదు.

**అదనపు నిధులు మంజూరైనా..**

చిట్యాలలో ఇన్‌గ్రాంట్ బడ్జెట్ కింద 2021లో రూ.2 కోట్ల అంచనాతో సమీకృత మార్కెట్ పనులు ప్రారంభించారు. డిజైన్ మాత్రం రూ.5 కోట్లకు రూపొందించారు. అదనంగా రూ.3 కోట్ల నిధులు మంజూరైనా గుత్తేదారుతో అదనపు నిధుల పనుల ఒప్పందం జరగలేదు. ఈలోపు ఎన్నికల ప్రకటన వెలువడటంతో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం స్లాబ్‌ల వరకు పనులు జరిగాయి.

నకిరేకల్‌లో రూ.2 కోట్లతో ప్రారంభించి రెండు స్లాబుల వరకు పనులు జరిగాయి. ఆ తర్వాత నిలిచిపోయాయి. పనుల్లో జాప్యం కారణంగా గుత్తేదారును మార్చి మరొకరికి అప్పగించినా ముందుకు సాగటం లేదు.

దేవరకొండలో రూ.4.5 కోట్లు మంజూరవగా స్థల సమస్యతో కొంతకాలం వాయిదా పడింది. ప్రస్తుతం అంచనా విలువ రూ.11 కోట్లకు పెంచారు. గుత్తేదారు ముందుకు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి.

హాలియాలో రూ.2 కోట్లతో పనులు చేపట్టగా స్లాబ్ వరకు నిర్మించారు. అంచనా వ్యయం రూ.5 కోట్లకు పెంచారు. పనులు నిలిచిపోయాయి.

**బిల్లులు అందక.. పనులు సాగక**

చండూరులో పిల్లర్ల దశ వరకే నిర్మించారు. దీని నిర్మాణానికి రూ. 2 కోట్లు కేటాయించారు. మిగతా పనులు నిధుల లేమితో నిలిచిపోయాయి.

మిర్యాలగూడలో రూ.1.20 కోట్లతో చేపట్టగా అసంపూర్తిగానే ఉంది. ఇక్కడ కూడా నిధులు సరిపడక పనులు ముందుకు సాగటం లేదు.

భువనగిరిలో రూ.8.40 కోట్ల అంచనాతో చేపట్టగా నిధుల కొరత కారణంగా నిర్మాణం ముందుకుసాగటం లేదు.

ఆలేరు, యాదగిరిగుట్ట పురపాలికలలో ఒక్కో దానికి రూ.2 కోట్ల వ్యయంతో నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. చేసిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో మధ్యలోనే పనులు నిలిపివేశారు.

**రాకపోకలకు ఇబ్బంది...**

సమీకృత మార్కెట్ల నిర్మాణం పూర్తికాకపోవడంతో ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 19 పురపాలికల్లో రోడ్లపై వ్యాపారాలు సాగిస్తున్నారు. ప్రధాన రోడ్లు, సంతల్లో అమ్మకాలు చేపడుతున్నారు. ప్రధాన రోడ్ల వెంట వ్యాపారాలు సాగిస్తుండటంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. వాహనాలు రావడంతో దారి మళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోజురోజుకూ పట్టణాల్లో జనసందడి పెరగడంతో పాటు వాహనాల సంఖ్య కూడా పెరుగుతోంది.




గుంటూరు: భవన నిర్మాణాల కోసం ఐదు అంతస్తుల వరకు ఎలాంటి అనుమతులు అవసరం లేదని పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి అనుమతులు పొందవచ్చన్నారు. లేఅవుట్, భవనాలకు సంబంధించి మున్సిపాలిటీకి రుసుము చెల్లిస్తే అనుమతులన్నీ ఇస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పట్టణాల్లో రోడ్లు, తాగునీరు, వీధిదీపాలు, వరదనీరు, ఘనవ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై 15 రోజుల్లో డీపీఆర్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. పాతపన్ను బకాయిల వసూళ్లకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆచార్య నాగార్జున వర్సిటీలో రాష్ట్రస్థాయి కార్యశాల నిర్వహించారు. దీనికి 123 మంది పురపాలక కమిషనర్లు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి నారాయణ మాట్లాడుతూ.. నెల్లూరు, కాకినాడ, రాజమండ్రిలో ఘనవ్యర్థాల నిర్వహణకు అనుమతి వచ్చిందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న చర్యలతో చెత్త సమస్య పరిష్కారమవుతోందని చెప్పారు. " 2014–2019 మధ్య మున్సిపల్ శాఖ పనితీరు అద్భుతంగా ఉంది. ఈ సమయంలో మున్సిపల్ పన్నులు రూపాయి కూడా పెంచలేదు. ఆ తర్వాత వైకాపా ప్రభుత్వం మున్సిపల్ నిధులను పక్కదారి పట్టించింది. ప్రస్తుతం పనులు చేసేందుకు గుత్తేదారులు ముందుకు రావడం లేదు. సీఎఫ్ఎంఎస్‌తో సంబంధం లేకుండా మున్సిపాలిటీలకే నిధులు కేటాయిస్తాం. 123 మున్సిపాలిటీలకు తాగునీరు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. విశాఖలో వ్యర్థాల నుంచి విద్యుదుత్పత్తి చేసే ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నాం. ఆధునిక సాంకేతికత విధానంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపడతాం. వివిధ రాష్ట్రాలు మన నిర్మాణ సాంకేతికత పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నాయి" అని నారాయణ తెలిపారు.




దేశంలో నిత్యావసరాల ధరలు భారీ స్థాయిలో పెరుగుతున్నాయని.. ఇందుకు మోదీ ప్రభుత్వ విధానాలే కారణమని కాంగ్రెస్ ఆరోపించింది. మోదీ ప్రభుత్వం ప్రకటించిన బుల్లెట్ ట్రైన్ ఇంకా రాలేదు కానీ.., ద్రవ్యోల్బణం మాత్రం ఆ రైలుకన్నా వేగంగా దూసుకెళ్తోందని విమర్శించింది.

దీంతో సామాన్యుడి వెన్ను విరుగుతోందని.. ఈ విషయంపై ప్రజలకు సమాధానాలు చెప్పాలని డిమాండ్ చేసింది. "మోదీ ప్రభుత్వం ప్రకటించిన బుల్లెట్ ట్రైన్ ఇంకా రాలేదు కానీ.., ద్రవ్యోల్బణం మాత్రం ఆ రైలుకన్నా వేగంగా దూసుకెళ్తోంది. గత పదిన్నరేళ్లలో ద్రవ్యోల్బణం రెండు–మూడు రెట్లు పెరిగింది. కూరగాయలు, వంట నూనె, నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోతున్నాయి. మోదీ ప్రభుత్వంలో ప్రతి ఒక్కటీ ఖరీదై పోతోంది. టమాటాల నుంచి ఆలుగడ్డల వరకు, నూనెలు, పాలు.. సామాన్యులకు దూరమవుతున్నాయి" అని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు. మీరు వాగ్దానం చేసిన మంచి రోజులంటే ఇవేనా? అని 'ఎక్స్' వేదికగా కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన ఆయన.. ప్రజలు సమాధానం కోరుకుంటున్నారని అన్నారు.

అంతేకాని వాక్చాతుర్యం కాదన్నారు. నిత్యావసర ధరలు రోజురోజుకు పెరుగుతున్నట్లు మీడియాలో వచ్చిన కథనాలను షేర్ చేసిన జైరాం రమేశ్.. కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగట్టారు.






## వేతనం కోసం ఎమ్మెల్యేల ఎదురుచూపులు..!

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలైనా ఎమ్మెల్యేలకు ఇప్పటి వరకు తొలి నెల వేతనం అందలేదని సమాచారం. ఈ విషయం శాసనసభ స్పీకర్ అబ్దుల్ రహీమ్ రాథర్ దృష్టికి వెళ్లడంతో ఎమ్మెల్యేల వేతనాలకు సంబంధించిన చట్టపరమైన నిబంధనలపై వివరణ కోరుతూ ఆయన జమ్మూకశ్మీర్ ప్రభుత్వానికి అధికారికంగా లేఖ రాశారు. ఈ అంశంపై తక్షణ స్పష్టత ఇవ్వాలని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీని కోరారు. ప్రస్తుత నిబంధనలు సరిపోవని భావించినట్లయితే, ఎమ్మెల్యేల జీత భత్యాలను పెంచే బిల్లును ప్రవేశపెట్టే అధికారం శాసనసభకు ఉంటుందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ స్వంత చట్టాన్ని రూపొందించే వరకు లెఫ్టినెంట్ గవర్నర్ తప్పనిసరిగా ఎమ్మెల్యేల జీతాలను నిర్ణయించాల్సి ఉంటుంది. అయితే, ఎమ్మెల్యే జీతాలు, అలవెన్సులలో మార్పులను ప్రతిపాదించే అధికారం అసెంబ్లీకి ఉంటుంది. 2019లో ఆర్టికల్ 370 రద్దవ్వడంతో రాష్ట్ర హోదా కోల్పోయి కేంద్రపాలిత ప్రాంతంగా మారిన తర్వాత జమ్మూకశ్మీర్‌లో జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) విజయం సాధించిన సంగతి తెలిసిందే. సీఎంగా బాధ్యతలు చేపట్టిన ఒమర్ అబ్దుల్లా.. రాష్ట్ర హోదాను తిరిగి తీసుకువచ్చేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఆయన మంత్రివర్గం చేసిన తీర్మానాన్ని లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆమోదించారు.

## అమరావతిలో మరో రూ.2,723 కోట్లతో నిర్మాణ పనులకు సీఎం చంద్రబాబు ఆమోదం

అమరావతి: రాజధాని అమరావతిలో మరో రూ.2,723 కోట్లతో నిర్మాణ పనులకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. జూన్ 12 నాటికి 1.18 లక్షల టిడ్కో ఇళ్లు పూర్తి చేసి ప్రారంభించాలని ఆదేశించారు. సచివాలయంలో జరిగిన సీఆర్డీఏ 44వ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఎల్పీఎస్ జోన్ 7, జోన్ 10లో మౌలిక వసతుల కల్పనకు నిర్ణయం తీసుకున్నారు.

రాజధాని ఔటర్ రింగ్‌రోడ్డు, విజయవాడ బైపాస్ రోడ్డు ప్రాజెక్టుపై సీఎం చంద్రబాబు చర్చించారు. ఇప్పటి వరకు రూ.47,288 కోట్ల విలువైన పనులకు సీఆర్డీఏ ఆమోదం తెలిపింది.

## ఎన్టీఆర్ అభిమానికి అనారోగ్యం.. అండగా ఉంటామని మంత్రి లోకేశ్ హామీ



అమరావతి: తీవ్ర అనారోగ్యానికి గురై ఇబ్బందులు పడుతున్న తెదేపా కార్యకర్త, ఎన్టీఆర్ అభిమాని అయిన మల్లికార్జునరెడ్డికి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అండగా నిలిచారు. నెల్లూరు పట్టణానికి చెందిన కె.మల్లికార్జునరెడ్డి.. నారా లోకేశ్ సేవాసమితి పేరుతో ఎన్నో కార్యక్రమాలు చేపట్టి పేద ప్రజలకు అండగా నిలిచారు. ఎన్టీఆర్ అభిమాని అయిన మల్లికార్జున రెడ్డి తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి కార్యకర్తగా ఉన్నారు. షుగర్ వ్యాధితో బాధపడుతున్న ఆయనకు ఏడాదిక్రితం పక్షవాతం రావడంతో పరిస్థితి విషమించింది. చికిత్స తీసుకుని కోలుకున్నారు. నెల క్రితం ఆయనకు మళ్లీ పక్షవాతం రావడంతో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. దీంతో నెల్లూరు నారాయణ ఆసుపత్రిలో ఉచితంగా వైద్యం అందించిన వైద్యులు.. ఇన్ఫెక్షన్ కారణంగా ఒక కాలును తొలగించారు. పక్షవాతం కారణంగా మరో కాలుతో నడవలేని పరిస్థితి. దీంతో మల్లికార్జునరెడ్డి దుస్థితిని పార్టీ నాయకులు సోషల్ మీడియా ద్వారా మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే స్పందించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ అన్నివిధాల అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మంత్రి సూచనలతో పురపాలక శాఖ మంత్రి నారాయణ వీడియో కాల్ ద్వారా మల్లికార్జునరెడ్డి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని, త్వరలో స్వయంగా వచ్చి కలుస్తానని భరోసా ఇచ్చారు. సాయం కోరిన వెంటనే స్పందించిన మంత్రి లోకేశ్‌కు మల్లికార్జునరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## తిరుపతి స్థానికులకు శ్రీవారి దర్శనం.. జనవరి 5న టోకెన్ల జారీ



తిరుమల: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి దర్శనార్థం వచ్చే తిరుపతి స్థానికులకు వచ్చే ఏడాది జనవరి 5న స్థానిక దర్శన కోటా టోకెన్లను జారీ చేయనున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం (తితిదే) ప్రకటించింది. తితిదే బోర్డు సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు ప్రతి నెలా మొదటి మంగళవారం తిరుపతి స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పించనున్నట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది జనవరి 7న మొదటి మంగళవారం తిరుపతి స్థానికులకు శ్రీవారి దర్శనం కల్పించేందుకు జనవరి 5న (ఆదివారం) తిరుపతి మహతి ఆడిటోరియం, తిరుమల బాలాజీ నగర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో దర్శన టోకెన్లు జారీ చేయన్నట్లు తెలిపింది. తిరుపతి అర్బన్, తిరుపతి రూరల్, చంద్రగిరి, రేణిగుంట మండలాలతో పాటు తిరుమలలోని స్థానికులు తప్పనిసరిగా తమ ఒరిజినల్ ఆధార్ కార్డు చూపించి టోకెన్లు పొందవలసి ఉంటుందని తితిదే పేర్కొంది.

## పేర్ని నానీ.. తప్పు చేయకపోతే తప్పించుకుని తిరగడం దేనికి?: మంత్రి కొల్లు రవీంద్ర



అమరావతి: వైకాపా నేత, మాజీ మంత్రి పేర్ని నాని కుటుంబం రేషన్ బియ్యం కుంభకోణంపై విచారణకు సిట్ ఏర్పాటు చేసేందుకు సిఫార్సు చేస్తానని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. పేర్ని నాని పేదల బియ్యం మాయం చేసింది వాస్తవం కాదా?అని ఆయన ప్రశ్నించారు. తన గోదాములో బియ్యం నిల్వలు తగ్గాయని స్వయంగా ఆయన ఒప్పుకున్నారని చెప్పారు. తప్పు చేయనపుడు దొంగలా తప్పించుకొని తిరగడం ఎందుకని ప్రశ్నించారు. తప్పు చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ఈ కేసు విచారణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## వైకాపా నేతలకు ఇంకా అమరావతిపై కక్ష తీరలేదు: మంత్రి నారాయణ



అమరావతి: రాష్ట్రంలోని 26 జిల్లాలనూ సమానంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఏపీ మంత్రి నారాయణ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ రాష్ట్రానికి, దేశానికైనా రాజధాని అవసరమన్నారు. అమరావతి రాజధానిని అభివృద్ధి చేస్తామని చెప్పారు. దీంతో పాటు అన్ని ప్రాంతాలపై దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. రుణాలు తీసుకొచ్చామని.. వాటి భారం ప్రజలపై మోపేది లేదని స్పష్టం చేశారు. భూముల విలువ పెరిగాక రుణాలు తిరిగి చెల్లిస్తామన్నారు. ప్రజలపై భారం లేకుండా పనులు సాగుతాయని చెప్పారు. "గతంలో మేం తీసుకొచ్చిన పరిశ్రమలను వైకాపా ప్రభుత్వం తరిమేసింది. మళ్లీ పరిశ్రమలను తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. జనవరి 15 కల్లా రాజధాని నిర్మాణ పనుల టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తాం. కట్టని ఇళ్లకు గత ప్రభుత్వం రుణం తీసుకొని అనేక సమస్యలు తెచ్చింది. బ్యాంకులకు రూ.102 కోట్లు చెల్లిస్తే గానీ ముందుకు కదలని పరిస్థితి.

ఆ నిధుల విడుదలకు సీఎం చంద్రబాబు ఆమోదం తెలిపారు. భూముల అమ్మకం, సంపద సృష్టితోనే రుణాలు చెల్లిస్తాం. వైకాపా నేతలకు ఇంకా అమరావతి రాజధానిపై కక్ష తీరలేదు. అందుకే ఆ పార్టీ విష ప్రచారం చేస్తోంది" అని నారాయణ విమర్శించారు.

## అన్నదాత బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని నమ్మే ప్రభుత్వం మాది: మంత్రి నిమ్మల



అమరావతి: రైతులకు మంత్రి నిమ్మల రామానాయుడు జాతీయ రైతు దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అన్నదాత బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని బలంగా నమ్మే ప్రభుత్వం తమదన్నారు. వైకాపా అధినేత జగన్ రైతుల పొలం గట్ల మీద సర్వే రాళ్లపై తన బొమ్మలు వేయించుకోవడానికి రూ.700 కోట్లు వృథా చేశారని ధ్వజమెత్తారు. రైతులకు భూములపై హక్కులు లేకుండా, పట్టాదారు పాసుపుస్తకాలపై వారి ఫొటోలు లేకుండా జగన్.. తన బొమ్మ వేయించుకున్నారని దుయ్యబట్టారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తెచ్చి రైతుల ఆస్తులు దోచుకోవాలని చూశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం రాగానే ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు చేసి, భూముల రక్షణకు ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ తీసుకొచ్చామని వెల్లడించారు.

## అరసవెల్లి రథసప్తమి వేడుకలపై మంత్రి సమీక్ష.. వివరాలు ఇవే..

శ్రీకాకుళం: అరసవెల్లి రథసప్తమి వేడుకలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పండగగా నిర్వహించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించిందని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. దేశంలోనే అరసవెల్లి సూర్యనారాయణ స్వామి ఆలయం ప్రసిద్ధి చెందిందని, అందుకే రథసప్తమి వేడుకలను మూడ్రోజులపాటు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ సందర్భంగా వేడుకల ఏర్పాట్లపై జిల్లా ఉన్నతాధికారులతో మంత్రి అచ్చెన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. రథసప్తమి వేడుకలకు దేశవ్యాప్తంగా పెద్దఎత్తున భక్తులు రానున్న నేపథ్యంలో ఎలాంటి ఏర్పాట్లు చేయాలి, ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు ఏవిధంగా తీసుకోవాలనే అంశాలపై అధికారులను మంత్రి అచ్చెన్న సూచనలు చేశారు. ఈ సందర్భంగా అరసవెల్లి అభివృద్ధికి రూ.100 కోట్లతో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపించినట్లు ఆయన తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రసాదం పథకానికి అరసవెల్లి ఆలయాన్ని ఎంపిక చేయాలని కోరినట్లు మంత్రి వెల్లడించారు. సమీక్ష అనంతరం అధికారులతో కలిసి స్వామి



వారికి జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి అచ్చెన్నాయుడు పట్టువస్త్రాలు సమర్పించారు. కాగా, 04 ఫిబ్రవరి, 2025 నుంచి మూడ్రోజులపాటు రథసప్త మి వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఇప్పటికే ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు అధికారులు, మంత్రులు చర్యలు చేపట్టారు.


## విజయసాయి దోపిడీ ముఠా చేయని కుంభకోణం లేదు: సోమిరెడ్డి



అమరావతి: వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి దోపిడీ ముఠా చేయని కుంభకోణం లేదని తెదేపా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శించారు. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జెన్‌కోకు విజయసాయి అనుబంధ సంస్థ బొగ్గు అమ్మిందని ఆరోపించారు. 4.5 లక్షల టన్నుల నాసిరకం బొగ్గును.. టన్ను రూ.8,500లకు విక్రయించిందన్నారు. అధిక ధరకు కొని ప్రజలపై విద్యుత్ భారం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయసాయి వియ్యంకుడికి ఆదాయం కోసం ప్రజలపై ట్రూఅప్ ఛార్జీలు వేశారన్నారు. ట్రైడెంట్ నాలెడ్జ్ కంపెనీ నాసిరకం బొగ్గు సరఫరాపై శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని.. దీనిపై సీఐడీ, విజిలెన్స్ ఎందుకు చర్యలకు ఉపక్రమించట్లేదని ప్రశ్నించారు. విజయసాయి దొంగల ముఠాపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జగన్ కుంభకోణాలపై చర్యలకు వివిధ శాఖల్లో సిబ్బంది కూడా సరిపోవట్లేదని వ్యాఖ్యానించారు. 108, 104 స్కామ్ పైనా సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని సోమిరెడ్డి కోరారు.

## ‘త్రిబాణధారి బార్బరిక్’ - ప్రపంచం చూడని మహావీరుడు

తెలుగు సినిమా రంగంలో కొత్త ఆలోచనలతో ఉన్న యువ దర్శకులు స్టోరీ సెలెక్షన్ తో ఎంతగానో ఆకట్టుకుంటున్నారు. కంటెంట్‌కు ప్రాధాన్యమిస్తున్న ఈ కాలంలో, కమర్షియల్ సినిమాల కంటే ప్రయోగాత్మక చిత్రాలకే ఎక్కువ ఆదరణ లభిస్తోంది. ఈ తరుణంలో వనరా సెల్యులాయిడ్ అనే కొత్త నిర్మాణ సంస్థ ప్రారంభమైంది. వీరి మొదటి ప్రాజెక్ట్ ‘త్రిబాణధారి బర్బరిక్’ టైటిల్ తోనే మంచి హైప్ క్రియేట్ చేసుకుంది. ఇక ఈ సినిమా మోహన్ శ్రీవాత్స దర్శకత్వంలో రూపొందుతోంది. విజయ్‌పాల్ రెడ్డి అదిధాల నిర్మాణం వహిస్తున్న ఈ చిత్రానికి స్టార్ డైరెక్టర్ మారుతి సమర్పకుడిగా ఉన్నారు. తాజాగా విడుదలైన ఈ సినిమా మోషన్ పోస్టర్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ‘త్రిబాణధారి బర్బరిక్’ అనే టైటిల్ ఒక ప్రత్యేకమైన స్ఫూర్తిని అందిస్తోంది. ఈ పోస్టర్‌లో పురాణ గాథను ఆధునిక ప్రపంచంతో మిళితంగా చూపించనున్నారు. గటోత్కచుని కొడుకు




బర్బరిక్ కథను ఒక బాలుడికి చెప్పినట్లు ఒక వాయిస్ ఓవర్‌తో ప్రారంభమవుతుంది. “ప్రపంచం చూడని మహావీరుడు” అంటూ బర్బరిక్ శక్తిని ప్రస్తావిస్తూ, ఆయనకు ఉన్న అత్యంత అద్భుతమైన సామర్థ్యాలను తెలియజేస్తుంది. ఈ మోషన్ పోస్టర్‌లో బర్బరిక్ భీముని మనవడిగా, గటోత్కచుని కుమారుడిగా తన గర్వాన్ని ప్రకటిస్తున్నట్లుగా ఉంది. మూడు బాణాలను ఒకేసారి ప్రయోగించే శక్తి ఉన్న బర్బరిక్ పాత్ర విశేషంగా చూపించబడింది. ఈ పౌరాణిక గాథను ఆధునిక ప్రపంచానికి అనుసంధానిస్తూ పోస్టర్‌లో గాంధీవదారి అర్జున, పాశుపతాస్త్రం, బ్రహ్మాస్త్రం, గరుడ పురాణం వంటి పుస్తకాలు, ఆధునిక గన్ వంటి అంశాలు సస్పెన్స్‌ను పెంచుతున్నాయి. ఇండియన్ సినిమా చరిత్రలో తొలిసారి ఈ సినిమాతో ఇన్ఫ్యూషన్ బ్యాండ్ సంగీతాన్ని అందించడం విశేషం. ఈ థీమ్ మ్యూజిక్ ప్రేక్షకులకు గూస్‌బంప్స్ తెచ్చేలా ఉంది. దర్శకుడు భారీ విజన్‌తో ఈ సినిమాను రూపొందించారని, నిర్మాతల సమర్పణ కూడా అత్యున్నత స్థాయిలో ఉందని ఈ మోషన్ పోస్టర్ ద్వారా తెలియజేసింది. ఈ సినిమాలో సత్యరాజ్, వశిష్ఠ ఎన్ సింహా, సాంచి రాయ్, సత్యం రాజేష్, క్రాంతి కిరణ్, వీవీ గణేష్, మోట్టా రాజేంద్ర, ఉదయభాను ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. సినిమాటోగ్రఫీకి కుశేందర్ రమేశ్ రెడ్డి, ఎడిటింగ్‌కు మార్తాండ్ కె. వెంకటేష్, ఆర్ట్ డైరెక్టర్‌గా శ్రీనివాస్ పున్నా, యాక్షన్ సీక్వెన్స్‌లకు రామ్ సుంకర వర్క్ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. త్వరలోనే విడుదలపై మరో అప్డేట్ ఇవ్వనున్నారు.

## నల్లని డ్రెస్సులో అషు హీటెక్కించేసిందిగా..

అషూ రెడ్డి.. ఈమధ్య ట్రావెలింగ్ కు సంబంధించిన ఫొటోలతో సోషల్ మీడియాని షేక్ చేస్తోంది. ఇప్పుడు సరికొత్తగా లిస్బన్ వీధుల్లో దిగిన ఫోటోలను షేర్ చేస్తూ మరోసారి అందరి దృష్టిని ఆకర్షించారు. బ్లాక్ కలర్ డ్రెస్సులో ఆమె స్టైలిష్ లుక్‌తో ఫ్యాషన్ లవర్స్‌కి స్ఫూర్తిగా నిలుస్తున్నారు. “రాధిక అక్క ఇన్ పోర్చుగల్” అంటూ క్యాప్షన్ ఇచ్చిన అషూ, తన ట్రావెల్ యాడిక్ట్ హాబీని పంచుకున్నారు. ఇక అషు ఇక నెవ్వర్ బిఫోర్ అనేలా స్టైలిష్ లుక్ లో, అందంగా కనిపిస్తున్నారు. సింపుల్ డ్రెస్‌ని ఎంత స్టైలిష్‌గా ప్రదర్శించవచ్చో ఆమెకు తెలుసు. ఆమె బాడీ లాంగ్వేజ్, ఆకర్షణీయమైన



పోజులతో అషూ తన ప్రత్యేకతను చూపించారు. స్మార్ట్ లుక్స్‌తో పాటు, ఆమె ఫోటోలు చూసిన ప్రతి ఒక్కరు ఆమె బ్యూటీని ప్రశంసిస్తున్నారు. లిస్బన్ వీధుల్లోని చారిత్రక భవనాలు, వెనెజుల స్టైల్ బ్యాక్‌డ్రాప్‌లో ఆమె ఫోటోలను మరింత ఆకర్షణీయంగా ఉన్నాయి. ఇటీవల తన ప్రయాణాల ద్వారా అషూ ఫ్యాషన్ మరియు గ్లామర్‌ని సరికొత్తగా ప్రదర్శిస్తున్నారు. ఆమె టెక్నికల్‌గా ఫ్యాషన్ ను ఎలా మెయింటైన్ చేయాలో, కొత్త ఫ్యాషన్ స్టేట్మెంట్లను ఎలా ప్రదర్శించాలో తెలిసిన స్టైలిష్ ఆర్టిస్ట్‌గా నిలుస్తున్నారు. ఇక ఫాలోవర్స్ సైతం ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో ఫోటోలు షేర్ చేస్తే వెంటనే అందులో లైక్స్, కామెంట్స్ తో తమ అభిమానాన్ని చూపిస్తున్నారు. ఇక ఆమె కెరీర్ లో మరో స్థాయికి వెళ్లాలని ప్రయత్నం చేస్తోంది. ఎక్కువగా యూట్యూబ్ సాంగ్స్ ద్వారా మంచి క్రేజ్ అందుకుంది. ఇక బిగ్ బాస్ లో కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకుంది. అప్పుడే అమ్మడు యువతను ఎక్కువగా ఎట్రాక్ట్ చేసింది. అలాగే చిన్న చిన్న సినిమాల్లో కూడా అవకాశాలు అందుకుంటోంది. మరి ప్రస్తుతం ఈ అమ్మడు తన గ్లామర్ షో ద్వారా కొత్తగా ఏమైనా అవకాశాలు అందుకుంటుందోమే చూడాలి.




## ‘సంభార్’లో దిగిన హీరో నాని



గతంలో హాలీవుడ్‌లోనే కనిపించే మూవీ ఫ్రాంచైజీలు ఇప్పుడు తెలుగు సినిమా పరిశ్రమలో కూడా కనిపిస్తున్నాయి. అందులో నేచురల్ స్టార్ నాని నిర్మాణంలో వస్తున్న %ఎ×ు% సిరీస్ ఒకటి. శైలేష్ కొలను దర్శకత్వంలో వచ్చిన ‘హిట్: ది ఫస్ట్ కేస్’లో విశ్వక్ సేన్ హీరోగా నటించాడు. ఆ తర్వాత వచ్చిన ‘హిట్: ది సెకెండ్ కేస్’లో అడివి శేష్ నటించాడు. ఈ రెండూ భారీ విజయాన్ని సొంతం చేసుకున్నాయి. మొదటి రెండు భాగాలు ప్రేక్షకుల ఆదరణను సొంతం చేసుకోవడంతో ఇప్పుడు ‘హిట్ ది థర్డ్ కేస్’ను రూపొందిస్తున్నారు. ఇందులో నేచురల్ స్టార్ నాని హీరోగా చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే దీనికి సంబంధించిన షూటింగ్ కూడా మొదలైంది. అంతేకాదు, చాలా వరకూ టాకీ పార్టును సైతం కంప్లీట్ చేసుకున్నారు. మిగిలిన దాన్ని కూడా వీలైనంత త్వరగా పూర్తి చేసేలా సన్నాహాలు చేస్తున్నారు. నేచురల్ స్టార్ నాని - శైలేష్ కొలను కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న ‘హిట్: ది థర్డ్ కేస్’ మూవీకి సంబంధించిన షూటింగ్ ప్రస్తుతం రాజస్థాన్‌లోని జైపూర్‌కు 80 కిలోమీటర్ల దూరంలో ‘సంభార్’ అనే ఉప్పు నీటి సరస్సు దగ్గర జరుగుతోంది. ఇందులో హీరో నానిపై కొన్ని కీలకమైన సన్నివేశాలను చిత్రీకరించడంతో పాటు యాక్షన్ సీక్వెన్స్‌లను కూడా ప్లాన్ చేసినట్లు తెలిసింది. ‘సంభార్’ ఉప్పు నీటి సరస్సుపై ‘హిట్: ది థర్డ్ కేస్’ మూవీకి సంబంధించిన షూటింగ్ మరో రెండు వారాల పాటు జరగబోతుందని కూడా తెలిసింది. అయితే, గతంలో ఈ ప్రాంతంలో ఏ ఇండియన్ సినిమాకు కూడా షూటింగ్ జరగలేదు. దీంతో ఇప్పుడు నాని మూవీ కోసం ఇంత రిస్క్ ఎందుకు చేస్తున్నారు అన్నది ఆసక్తికరంగా మారింది. దీంతో ఇప్పుడీ వార్త టాలీవుడ్ వర్గాల్లో చర్చనీయాంశం అయింది. ఇక, ‘సంభార్’ అనేది భారతదేశంలోనే పెద్ద లోతట్టు ఉప్పు సరస్సు అని చాలా మందికి తెలీదు. ఇందులో మంథా, రూపన్ గడ్, ఖరీ, ఖండేలా, మొడ్తా, సమోద్ వంటి ఆరు నదుల నీరు వచ్చి చేరుతుంది. 96 కిలో మీటర్లు ఉన్న ఈ సరస్సు 5700 చదరపు కిలోమీటర్లలో విస్తరించి ఉంటుంది. అక్కడ ఉష్ణోగ్రతల్లో కూడా చాలా తేడాలు కనిపిస్తుంటాయి.

అలాంటి సరస్సులో నాని సినిమా షూటింగ్ చేయడం చాలా మందిని ఆశ్చర్యపరుస్తోంది. నాని - శైలేష్ కొలను కాంబినేషన్‌లో రాబోతున్న ‘HIT: ది థర్డ్ కేస్’ సినిమాను నేచురల్ స్టార్ సమర్పణలో వాల్ పోస్టర్ బ్యానర్‌పై ప్రశాంతి తిపిర్నేని నిర్మిస్తున్నారు.

దీనికి మిక్కీ జే మేయర్ సంగీతాన్ని సమకూర్చుతున్నాడు. ఈ చిత్రంలో శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా చేస్తోంది. ఈ మూవీ వచ్చే ఏడాది మే 1వ తేదీన రిలీజ్ కాబోతుంది.

## కల్కి-2.. ఎంతవరకు వచ్చిందంటే..



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, టాలెంటెడ్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ కాంబోలో తెరకెక్కిన కల్కి 2898 ఏడీ మూవీ ఎలాంటి హిట్ అయిందో అందరికీ తెలిసిందే. భారీ బడ్జెట్ తో ప్రముఖ వైజయంతీ మూవీస్ బ్యానర్ పై అశ్వనీదత్ నిర్మించిన ఆ సినిమా.. బాక్సాఫీస్ వద్ద రూ.1000 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. ఆడియన్స్ ను సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లింది. అయితే కల్కి మూవీకి సీక్వెల్ రానున్న విషయం తెలిసిందే. దీంతో సినీ ప్రియులు ఎంతగానో వెయిట్ చేస్తున్నారు. అందుకు సంబంధించిన అప్డేట్స్ ఎప్పుడిస్తారోనని ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే కల్కి 2 ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయని నిర్మాత అశ్వనీదత్ ఓ సందర్భంలో తెలిపారు. కొంత భాగం షూటింగ్ కూడా పూర్తి అయిందని చెప్పారు. ఇప్పుడు గోవాలో జరుగుతున్న ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్ లో కల్కి నిర్మాతలు, అశ్వనీదత్ కుమార్తెలైన స్వప్న, ప్రియాంక.. కల్కి సీక్వెల్ కోసం మాట్లాడారు. షూటింగ్ అప్డేట్ ఇచ్చారు. పార్ట్ 2కు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయని తెలిపారు. రెగ్యులర్ షూటింగ్ ఎప్పటి నుంచి ప్రారంభించాలనే దానిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని స్పష్టం చేశారు. అన్నీ సిద్ధమయ్యాక అఫీషియల్ గా అనౌన్స్ చేస్తామని తెలిపారు. కల్కి 2898 ఏడీతో పాటు సీక్వెల్ కు సంబంధించిన షూటింగ్ పార్ట్ ను కొంతమేర ఇప్పటికే తీసినట్లు చెప్పారు. పార్ట్ 2కు సంబంధించి ఇప్పటి వరకు 35 శాతం షూట్ జరిగిందని వెల్లడించారు. బాలీవుడ్ హీరోయిన్ దీపికా పదుకొణె పార్ట్ -2లో కూడా నటిస్తున్నట్లు తెలిపారు. సీక్వెల్ లో కూడా దీపిక.. కొన్ని సీన్స్ లో అమ్మగా కనిపించనున్నారని చెప్పారు. అయితే ఫస్ట్ పార్ట్ షూటింగ్ జరుగుతున్నప్పుడు దీపిక గర్భిణీ. మూవీ రిలీజ్ తర్వాత ఆమె పండంటి బిడ్డకు జన్మనిచ్చారు. గోవాలో జరుగుతున్న ఇఫ్ఫీ వేడుకల్లో పాల్గొనడం చాలా హ్యాపీగా ఉందని ప్రియాంక, స్వప్న తెలిపారు. టాలీవుడ్ కు లభిస్తున్న ఆదరణ చూస్తుంటే గర్వంగా ఉందన్నారు. ఇక కల్కి సినిమా విషయానికొస్తే.. అశ్వత్థామగా అమితాబ్ బచ్చన్, సుప్రీం యాస్కిన్ గా కమల్ హాసన్ మెప్పించారు. వారితో పాటు ఎంతో మంది యాక్టర్స్ సందడి చేశారు. బౌంటీ ఫైటర్ భైరవగా, చివర్లో కర్ణుడిగా ఆకట్టుకున్నారు ప్రభాస్. అలా పార్ట్-2పై మంచి అంచనాలు పెంచారు. మరి కల్కి సీక్వెల్ నుంచి ఫ్యూచర్ లో ఎలాంటి అప్డేట్స్ వస్తాయో వేచి చూడాలి.

## మాళవిక.. వ్హాటే గ్లామర్ షో

తెలుగు సినిమా రంగంలో కొద్ది సమయంలోనే విశేషమైన గుర్తింపును సొంతం చేసుకున్న హీరోయిన్లలో మాళవిక శర్మ ఒకరు. 2018లో వచ్చిన ‘నేల టికెట్’ అనే చిత్రం ద్వారా ఈ అమ్మడు నటిగా పరిచయమైంది. కానీ, ఈ చిత్రం ఆశించిన రీతిలో సక్సెస్ కాలేదు. ఈ క్రమంలోనే రామ్ నటించిన ‘రెడ్’ మూవీలో హీరోయిన్‌గా చేసింది. ఈ చిత్రంతో ఆమె మొదటి విజయాన్ని ఖాతాలో వేసుకుంది. టాలీవుల్‌లోకి ఎంట్రీ ఇచ్చిన కొత్తలోనే మాళవిక శర్మ మంచి క్రేజ్ తెచ్చుకున్నా వరుసగా సినిమాలు మాత్రం చేయలేకపోయింది. కానీ, తమిళంలోకి ఎంట్రీ ఇచ్చి అక్కడ వరుస ప్రాజెక్టులతో బిజీ



అయిపోయింది. ఇలా ఇప్పటికే తమిళంలో ‘కాఫీ విత్ కాదల్’, తెలుగులో గోపీచంద్‌తో ‘భీమా’, సుధీర్ బాబుతో ‘హరోం హర’ మూవీలు చేసింది. కానీ, ఇవేమీ ఆమెకు సక్సెస్‌ను మాత్రం అందించలేకపోయాయి. కొంత కాలంగా వరుసగా సినిమాలు చేస్తూ సత్తా చాటుతోన్నప్పటికీ మాళవిక శర్మ కెరీర్‌ను సక్సెస్‌ఫుల్‌గా నడపడం లేదు. దీంతో ఆమెకు ఆఫర్లు సన్నగిల్లాయి. అయితేనేం ఈ అమ్మడు సోషల్ మీడియాలో సైతం యమ యాక్టివ్‌గానే ఉంటోంది. ఇందులో సుదీర్ఘ కాలంగా సందడి చేస్తోన్న ఈ ముద్దుగుమ్మ ఎప్పటికప్పుడు తన సినిమా విశేషాలతో పాటు వ్యక్తిగత వివరాలను ఫాలోవర్లతో పంచుకుంటోంది. హీరోయిన్ మాళవిక శర్మ సోషల్ మీడియాలో సుదీర్ఘ కాలంగా హడావిడి చేస్తూనే ఉంటోంది. మరీ ముఖ్యంగా ఈ మధ్య కాలంలో ఈ చిన్నది ఆఫర్లు తగ్గిపోవడంతో దీని ద్వారానే ఫ్యాన్స్‌ను ఫిదా చేస్తోంది. ఇందులో భాగంగానే గ్లామర్ ట్రీట్ ఇస్తోంది. అలా తరచూ ఘాటు ఫొటోలు, వీడియోలను షేర్ చేస్తోంది. తద్వారా మాళవిక శర్మ రేంజ్ మరింతగా పెరిగిపోతూనే ఉంటోంది. టాలీవుడ్ యంగ్ హీరోయిన్ మాళవిక శర్మ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో ఓ క్రేజీ ఫొటోను షేర్ చేసింది. ఇందులో ఆమె వైట్ కలర్ డిజైనర్ డ్రెస్‌లో స్టన్ అయ్యేలా దర్శనమిచ్చింది. దీంతో ఆమె షేర్ చేసిన ఈ ఫొటోకు నెటిజన్ల నుంచి భారీ స్థాయిలో స్పందన దక్కుతోంది.

## సలీం కోసం ఎదురు చూస్తున్న సలీం అనార్‌లా ఉంది

సలీం కోసం ఎదురు చూస్తున్న అనార్‌లా .. దేవదాస్ కోసం వేచి చూస్తున్న పార్వతిలాగా ఉంది.. ఎవరీ సుందరి? అంటారా? కచ్చితంగా సోనా అలియాస్ సోనాక్షి. షాట్ గన్ శత్రుఘ్న సిన్హా కుమార్తె. ఇటీవలే ఇంట్లో ఎదురించి నచ్చినవాడిని పెళ్లాడింది. సహనటుడు జహీర్ ఇక్బాల్ తో ప్రేమాయణం సాగించిన సోనాక్షి.. ఇటీవలే పెళ్లితో ఓ ఇంటిదైంది. ఈ మతాంతర వివాహంపై కుటుంబ సభ్యులు తర్జనభర్జన పడ్డారు. చివరికి ప్రేమికులను ఆశీర్వదించారని ముంబై



మీడియా కథనాలు వండి వార్చింది. జీవితంలో ఎన్నో జరుగుతుంటాయి. ప్రతి మలుపులో ఆనందాలను వెతుక్కోవడమే మనిషి విధి. అదంతా సరే కానీ, పెళ్లి తర్వాత తాను ఎంత ఆనందంగా ఉందో సోనాక్షి ఇప్పటికే పలు ఫోటోలు, వీడియోల ద్వారా చెప్పకనే చెప్పింది. పెళ్లి తర్వాత మొదటి కర్వా చౌత్ (అట్ల తద్ది), దీపావళి పండుగలను సోనాక్షి ఎంతో వైభవంగా భర్తతో కలిసి జరుపుకుంది. ఈ వేడుకల నుంచి ఫోటోలు వీడియోలు అంతర్జాలంలో వైరల్ అయ్యాయి. ఇప్పుడు ఓ పెద్ద కోట వద్ద ఫోటోషూట్లతో కాలక్షేపం చేసింది సోనాక్షి. ఈ ఫోటోషూట్ నుంచి రెండు విభిన్నమైన డిజైనర్ దుస్తుల్లో ఉన్న ఫోటోలను షేర్ చేసింది. ఒకటే ట్రిప్.. కానీ రెండు లుక్స్ !! అంటూ సోనాక్షి షేర్ చేసిన ఫోటోగ్రాఫ్స్ అంతర్జాలంలో వైరల్ గా మారుతున్నాయి. సోనాక్షి అందమైన కాటుక కళ్లు .. ఎంపిక చేసుకున్న డిజైనర్ బ్లౌజ్.. కాంబినేషన్ చీర.. తన అందాన్ని పదింతలు చేసాయి. నిజంగానే సలీం కోసం ఎదురు చూస్తున్న అనార్కలిలా ఉంది. దేవదాస్ కోసం వేచి చూసే పార్వతిని, మజ్ను కోసం వెతికే లైలాను తలపిస్తోంది.




హైదరాబాద్: సంధ్య థియేటర్ ఘటన నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసే ఆలోచనలో తెలుగు సినీ ప్రముఖులు ఉన్నట్లు నిర్మాత నాగవంశీ తెలిపారు. రామ్‌చరణ్ 'గేమ్ ఛేంజర్' మూవీ ప్రచారంలో భాగంగా అమెరికాలో ఉన్న నిర్మాత, ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు హైదరాబాద్‌కు తిరిగి వచ్చాక సీఎంను కలుస్తామని చెప్పారు. టికెట్ ధరల పెంపు, ప్రీమియర్ షోలపై చర్చిస్తామని నాగవంశీ తెలిపారు. బాలకృష్ణ కథానాయకుడిగా బాబీ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డాకు మహారాజ్'. సితార ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై నాగవంశీ ఈ మూవీని నిర్మిస్తున్నారు. సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈక్రమంలో సోమవారం చిత్ర దర్శకుడు బాబీ, నిర్మాత నాగవంశీ విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం తెలుగు చిత్ర పరిశ్రమలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో సీఎంను కలిసే యోచనలో ఉన్నట్లు తెలిపారు. సంధ్య థియేటర్ ఘటన తర్వాత ఈ మూవీ విషయంలో ఏమైనా జాగ్రత్తలు తీసుకుంటున్నారా? అని అడగ్గా.. 'ఆ నిమిషంలో జరిగే దాన్ని ఎవరూ ఆపలేరు. ఈసారి నుంచి ఇంకాస్త జాగ్రత్తలు తీసుకుంటాం. ఒక సినిమా ఎన్నో థియేటర్‌లలో రిలీజ్ అవుతుంది. ప్రతిచోటా మేం ఫాలోఅప్ చేయలేం కదా.. ఒక వేళ అలా ఫాలోఅప్ చేస్తామని చెప్పినా అది నమ్మశక్యంగా ఉంటుందా? మా పరిధిలో ఉన్నంతవరకూ తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలు తీసుకుంటాం. ఇటీవల జరిగిన ఘటనలు మరోసారి జరగకుండా చూసుకోవడానికి ప్రయత్నిస్తాం' అని సమాధానమిచ్చారు. అలాగే, ఇండస్ట్రీ ఆంధ్రప్రదేశ్‌కు షిఫ్ట్ అవుతుందని టాక్ వినిపిస్తోంది కదా? దానిపై మీ సమాధానం ఏంటి అని అడగ్గా, "నేను చాలా డబ్బులు పెట్టి హైదరాబాద్‌లో ఇల్లు కట్టుకున్నా. మరో ప్రాంతానికి ఎందుకు వెళ్తాను. ఇండస్ట్రీకి ఏపీ ప్రభుత్వం నుంచి ఎప్పుడూ సపోర్ట్ ఉంటుందని పవన్ కల్యాణ్ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచి చెబుతూనే ఉన్నారు. అప్పటినుంచి రిలీజ్ అయిన సినిమాలకు కూడా సపోర్ట్ ఇస్తూనే ఉన్నారు' అని అన్నారు.

**తెలంగాణ సర్కారు నిర్ణయంతో సంక్రాంతి సినిమాల లెక్కలు తారుమారు :** సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటన.. దాని తదనంతర పరిణామాలు ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో హాట్‌టాపిక్‌గా మారిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో కొత్త సినిమాలకు టికెట్ రేట్లు పెంచేది లేదని, బెనిఫిట్ షోలకూ అనుమతి ఇవ్వమని తెలంగాణ సర్కారు ప్రకటించడంతో చిత్ర పరిశ్రమ వర్గాలు ఒక్కసారిగా షాకయ్యాయి. మరో 20 రోజుల్లో సంక్రాంతి సందర్భంగా వరుస సినిమాలు బాక్సాఫీస్‌కు క్యూ కడుతున్నాయి. ఇందులో భారీ బడ్జెట్, అగ్ర కథానాయకుల సినిమాలు ఉండటంతో వాటి వసూళ్లపై తీవ్ర ప్రభావం పడనుంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్‌రాజు నిర్మించిన 'గేమ్ ఛేంజర్', 'సంక్రాంతికి వస్తున్నాం'లతో పాటు, సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నాగవంశీ నిర్మిస్తున్న 'డాకు మహారాజ్' కూడా సంక్రాంతికే విడుదల కానుంది. 'పుష్ప2'కు ఇచ్చినట్లే వీటికి కూడా ప్రీమియర్ షోలు, టికెట్‌రేట్ల పెంపు ఉంటుందని అంతా అనుకున్నారు. కానీ, సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటన మొత్తం పరిస్థితులనే మార్చేసింది. సినిమాలకు సంక్రాంతి సీజన్ ఎంతో కీలకం. అగ్ర కథానాయకుడి నుంచి, చిన్న హీరో వరకూ కుదిరితే తమ మూవీని ముగ్గుల పండగకు తీసుకొద్దామని అనుకుంటారు. తెలంగాణ సర్కారు తీసుకున్న నిర్ణయం నేపథ్యంలో సీఎం రేవంత్‌నే నేరుగా కలిసి, చిత్ర పరిశ్రమకు కలిగే నష్టాన్ని వివరించనున్నట్లు తెలుస్తోంది. సంక్రాంతి సినిమాల టికెట్ రేట్లు, ఇతర మినహాయింపుల విషయంలో చర్చించనున్నారు. ఇటీవలే నిర్మాత దిల్‌రాజుకు తెలంగాణ ప్రభుత్వం కీలక పదవిని ఇచ్చింది. ఆయన్ను తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎఫ్‌డీసీ) ఛైర్మన్‌గా నియమించింది. ప్రస్తుతం అమెరికాలో ఉన్న ఆయన వస్తే కానీ, తదుపరి కార్యాచరణ ఏంటన్నది తెలియదు.




## హైకోర్టులో మోహన్‌బాబుకు చుక్కెదురు

హైదరాబాద్: సినీ నటుడు మోహన్‌బాబుకు తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. విలేకరిపై దాడి కేసులో ఆయన పెట్టుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. మోహన్‌బాబు అనారోగ్యంతో ఉన్నారని, గుండె, నరాల సంబంధిత సమస్యలు, మతిమరుపుతో బాధపడుతున్నారని ఆయన తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ప్రస్తుతం ఆయన తిరుపతిలో ఉన్నట్లు తెలిపారు. ఇటీవల దుబాయ్‌లో ఉన్న తన మనవడిని కలిసేందుకు మోహన్‌బాబు వెళ్లారని, అనంతరం తిరుపతికి తిరిగొచ్చి విద్యా సంస్థల బాధ్యతలు చూస్తున్నట్లు తెలిపారు. దాడి ఘటనలో ముందస్తు బెయిల్ ఇవ్వొద్దంటూ ఈ సందర్భంగా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ తన వాదనలు వినిపించారు. ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయస్థానం మోహన్‌బాబు ముందుస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టేసింది.

**వాదనలు జరిగాయిలా..!** పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న మోహన్‌బాబు ఫాంహౌస్‌లో ఈనెల 10న చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి కేసు నమోదైంది. న్యూస్ కవరేజ్‌కు వెళ్లిన విలేకరిపై మోహన్‌బాబు దాడి చేశారు. దీంతో సదరు విలేకరి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు మోహన్‌బాబుపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేశారు. దాని ప్రకారం పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని, అరెస్టు.. తదుపరి దర్యాప్తు చేయకుండా పోలీసులను ఆదేశించాలని మోహన్‌బాబు తన పిటిషన్‌లో కోరారు. దీనికి సోమవారం హైకోర్టులో వాదనలు జరిగాయి. జస్టిస్ కె.లక్ష్మణ్ ఈ పిటిషన్‌లపై విచారణ నిర్వహించారు. దీనికి సంబంధించి మోహన్‌బాబు తరఫు న్యాయవాది తన వాదనలు వినిపించారు. గాయపడిన విలేకరితో మోహన్‌బాబుకు కనీసం పరిచయం కూడా లేదని, అతనెవరో కూడా తెలిదయని కోర్టుకు తెలిపారు. అలాంటప్పుడు అతడిపై హత్యాయత్నం ఎలా చేస్తారని, పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు సరైనవి కావని, వాదనలు వినిపించారు. మోహన్‌బాబు కుటుంబ సమస్యలు, గొడవలను మీడియా ఛానళ్లు, సోషల్‌మీడియా పెద్దవిగా చేసి చూపించాయని వివరించారు. మంచు మనోజ్‌తో వచ్చిన బౌన్సర్లతో ప్రాణహాని ఉండటంతో ఆ విధంగా దాడి చేశారని, అనుకోకుండా జరిగిన ఘటన అని కోర్టుకు తెలిపారు. పోలీసుల తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపిస్తూ, ఈ ఘటనపై మొదట పహాడీషరీఫ్ పోలీసులు కేసు నమోదు చేసి, అనంతరం బాధితుడి వాంగ్మూలం ప్రకారం సెక్షన్లు జోడించినట్లు తెలిపారు. ఈ కేసులో మోహన్‌బాబు విచారణకు హాజరు కావాల్సిందేనని ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయవద్దని కోర్టును కోరారు. ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి మోహన్‌బాబు బెయిల్ పిటిషన్‌ను కొట్టేశారు. అయితే, విచారణకు హాజరైన రోజే ట్రయల్ కోర్టులో బెయిల్ మంజూరు చేయాల్సిందిగా కింది కోర్టును ఆదేశించాలని ఈ సందర్భంగా మోహన్‌బాబు తరఫు న్యాయవాది కోర్టును కోరారు. న్యాయవాది విజ్ఞప్తిని హైకోర్టు తిరస్కరించింది.

మోహన్‌బాబు అరెస్టు విషయంలో ఎలాంటి ఆలస్యం లేదని, చట్ట ప్రకారమే అంతా జరుగుతోందని ఇప్పటికే రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. హైకోర్టు తీర్పుతో పహాడీషరీఫ్ పోలీసులు తదుపరి చర్యలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు.

## పూర్తి పారదర్శక విధానంలో ఉద్యోగాలు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్: అభ్యర్థుల ప్రతిభ ఆధారంగా ఉద్యోగాలు కల్పిస్తున్నామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. చాంద్రాయణగుట్ట సీఆర్పీఎఫ్ గ్రూప్ సెంటర్‌లో రోజ్‌గార్ మేళా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కేంద్ర ఉద్యోగాలకు ఎంపికైన 526 మందికి ఆయన నియామక పత్రాలు అందజేశారు. దేశ వ్యాప్తంగా 71 వేల మందికి నేడు నియామక పత్రాలు అందజేస్తున్నట్లు చెప్పారు. పూర్తి పారదర్శక విధానంలో ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. దళారుల మాట విని మోసపోవద్దని ఉద్యోగార్థులకు సూచించారు.

**అభివృద్ధి, సంక్షేమం అందరికీ చేరాలన్నదే మా ఆకాంక్ష: బండి సంజయ్...** అభివృద్ధి, సంక్షేమం అందరికీ చేరాలన్నదే తమ ఆకాంక్ష అని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. హాకీంపేట్‌లోని నిసా కేంద్రంలో నిర్వహించిన రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కేంద్ర ఉద్యోగాలకు ఎంపికైన 340 మందికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే 8.50 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చామన్నారు. 10 లక్షల మందికి ఉద్యోగాలు ఇవ్వాలనేది కేంద్ర ప్రభుత్వం లక్ష్యమన్నారు. కేంద్ర ఉద్యోగాల్లో అన్ని శాఖల ఖాళీలు భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.



## ప్రజాస్వామ్యంలో భౌతిక దాడులకు తావులేదు: మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్: సినీనటుడు అల్లు అర్జున్ ఇంటిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా స్పందించారు. ప్రజా స్వామ్యంలో భౌతిక దాడులకు తావులేదని మంత్రి పేర్కొన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరూ వ్యవహరించకూడదని సూచించారు.

సంధ్య థియేటర్ ఘటనకు సంబంధించిన అంశం కోర్టులో ఉందని.. చట్టం తన పని తాను చేసుకుపోతుందని పేర్కొన్నారు.



## అల్లు అర్జున్ ఇంటిపై దాడి ఘటనలో నలుగురు కొడంగల్ వాసులు: డీకే అరుణ

హైదరాబాద్: సినీనటుడు అల్లు అర్జున్ ఇంటిపై దాడిని భాజపా ఎంపీ డీకే అరుణ ఖండించారు. దాడి ఘటనలో నలుగురు కొడంగల్ వాసులున్నారని ఆమె ఆరోపించారు. జైలు నుంచి విడుదలైన లగచర్ల రైతులను డీకే అరుణ పరామర్శించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. అల్లు అర్జున్ ఇంటిపై దాడి ఘటన నిందితుల్లో ఒకరు కాంగ్రెస్ జడ్పీటీసీగా పోటీ చేశారని.. ఆ పార్టీ నేతలే ఈ దాడి చేయించారనే అనుమానం కలుగుతోందన్నారు.

## గాంధీభవన్‌కు వెళ్లిన అల్లు అర్జున్ మామ.. స్పందించిన పీసీసీ అధ్యక్షుడు



హైదరాబాద్: కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ దీపాదాస్ మున్షీని హీరో అల్లు అర్జున్ మామ, కాంగ్రెస్ నేత చంద్రశేఖర్ రెడ్డి గాంధీభవన్‌లో కలిశారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, సీడబ్ల్యూసీ సభ్యుడు కొప్పుల రాజు, దీపాదాస్ మున్షీ ఉన్నారనే సమాచారంతో అయన గాంధీభవన్‌కు వెళ్లారు. పీసీసీ అధ్యక్షుడు మీడియా సమావేశంలో ఉన్నందున దీపాదాస్ మున్షీని కలిసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న మహేశ్‌కుమార్ గౌడ్ చంద్రశేఖర్ రెడ్డికి ఫోన్ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. "అల్లు అర్జున్ మామ చంద్రశేఖర్‌రెడ్డి కాంగ్రెస్ నేత. ఆయన నాకు మంచి స్నేహితుడు. చంద్రశేఖర్ రెడ్డి వచ్చినప్పుడు నేను మీడియా సమావేశంలో ఉన్నాను.

దీపాదాస్ మున్షీని ఆయన కలిశారు. ఆమెతో చంద్రశేఖర్‌రెడ్డికి పెద్దగా పరిచయం లేకపోవడంతో తొందరగా మాట్లాడి వెళ్లిపోయారు. చంద్రశేఖర్‌కు ఫోన్ చేసి మాట్లాడాను. ఒకట్రెండు రోజుల్లో కూర్చొని మాట్లాడదాం అని చెప్పాను" అని మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు.

## అల్లు అర్జున్ నివాసం వద్ద ఆందోళన కేసు.. ఓయూ జేఏసీ నేతలకు బెయిల్

హైదరాబాద్: సినీనటుడు అల్లు అర్జున్ నివాసం వద్ద ఆందోళన కేసులో అరెస్టయిన ఓయూ జేఏసీ నేతలకు బెయిల్ మంజూరైంది. వనస్థలిపురంలోని న్యాయమూర్తి నివాసంలో ఆరుగురు నిందితులను జూబ్లీహిల్స్ పోలీసులు హాజరుపరిచారు. వారికి న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేశారు. ఒక్కొక్కరు రూ.10వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని న్యాయమూర్తి ఆదేశించారు. అల్లు అర్జున్ ఇంటి వద్ద ఓయూ ఐకాస నేతలు ఆదివారం సాయంత్రం ఆందోళనకు దిగారు. టమాటాలు విసిరి.. పూలకుండీలు ధ్వంసం చేయడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. జూబ్లీహిల్స్‌లోని నివాసం వద్దకు చేరుకున్న ఐకాస అధికార ప్రతినిధి బోనాల నాగేశ్ మాదిగ, ఛైర్మన్ రెడ్డిశ్రీను ముదిరాజ్, రాష్ట్ర అధ్యక్షుడు బైరు నాగరాజుగౌడ్, కన్వీనర్ పి.ప్రకాశ్, నాయకుడు సి.మోహన్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి బుద్దా ప్రేమ్‌కుమార్‌గౌడ్, పి.ప్రకాశ్ తదితరులు ప్లకార్డులు పట్టుకొని అల్లు అర్జున్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఇంటి ప్రహరీ ఎక్కి లోపలికి టమాటాలు విసిరారు. గోడ దూకి వెళ్లి పూల కుండీలను పగులగొట్టారు. అక్కడే ఉన్న భద్రతా సిబ్బంది వారిని నిలువరించేందుకు ప్రయత్నించగా స్వల్ప తోపులాట చోటుచేసుకుంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాటలో మృతిచెందిన రేవతి కుటుంబాన్ని అల్లు అర్జున్ పరామర్శించి రూ.కోటి పరిహారం ఇవ్వాలని, బాలుడు శ్రీతేజ్‌ను మెరుగైన వైద్యం కోసం అమెరికాకు తరలించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరెడ్డి సిబ్బందితో అక్కడికి చేరుకొని ఆందోళనకారుల్ని అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. అల్లు అర్జున్ మేనేజర్ కాంతారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడికి పాల్పడిన ఆరుగురిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.




## సీవీ ఆనంద్ క్షమాపణలు.. సహనాన్ని కోల్పోయానంటూ పోస్ట్

హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ క్షమాపణలు చెప్పారు. నేషనల్ మీడియాను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు పోస్ట్ పెట్టారు. సంధ్య థియేటర్ ఘటనపై జాతీయ మీడియా ప్రశ్నలు అడిగినప్పుడు తాను సహనాన్ని కోల్పోయినట్లు తెలిపారు. సంధ్య థియేటర్ వద్ద అసలేం జరిగిందో తెలుపుతూ నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ తాజాగా ప్రెస్‌మీట్ నిర్వహించిన సంగతి తెలిసిందే. థియేటర్‌లో ఆరోజు ఏం జరిగిందో తెలుపుతూ కొన్ని వీడియోలను విడుదల చేశారు. ఈక్రమంలో మీడియా ఆయన్ను కొన్ని విషయాలపై ప్రశ్నించగా.. నేషనల్ మీడియా ఈ ఘటనకు మద్దతు ఇస్తుందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతో అక్కడ ఉన్న కొందరు జర్నలిస్టులు ఈ ఆరోపణలను తప్పుపట్టారు. తాజాగా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నట్లు సీవీ ఆనంద్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. "ఈ ఘటనపై విచారణ జరుగుతోంది. ప్రెస్‌మీట్‌లో రెచ్చగొట్టే ప్రశ్నలు వేయడంతో నేను కాస్త సహనాన్ని కోల్పోయాను. పరిస్థితులు ఎలా ఉన్నా సంయమనం పాటించాల్సి ఉంటుంది. నేను చేసింది పొరబాటుగా భావిస్తున్నాను. నేషనల్ మీడియాపై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నా. క్షమాపణలు కోరుతున్నా" అని తెలిపారు. మరోవైపు సంధ్య థియేటర్ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని, న్యాయపరమైన సలహాలు తీసుకుని ముందుకెళ్తామని హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ తెలిపారు. డిసెంబరు 4న సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటనపై మీడియా అడిగిన ప్రశ్నలకు సీపీ సమాధానమిచ్చారు. ఘటనకు సంబంధించిన సీసీ ఫుటేజ్‌ను ఆయన విడుదల చేశారు. ఇక ఈ ఘటనపై తాజాగా సినీ నటి, కాంగ్రెస్ నాయకురాలు మాజీ ఎంపీ విజయశాంతి స్పందించారు. ఇలాంటి ఘటన జరగడం దురదృష్టకరమన్నారు. దీనిపై తెలంగాణ సీఎం రేవంత్‌పై కేంద్రమంత్రులు ఆరోపణలు చేయడం గర్హనీయమన్నారు. ఈ ఘటనను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు భాజపా నేతలు యత్నిస్తున్నారన్నారు. సినీ పరిశ్రమకు అన్ని ప్రాంతాల ప్రజల ఆదరణ కావాలని.. ఇలాంటి ఘటనలు జరగకుండా సమస్యను పరిష్కరించుకునేందుకు ప్రయత్నం చేయాలని సూచించారు.

హైదరాబాద్: అల్లు అర్జున్ నివాసంపై ఓయూ విద్యార్థుల దాడి ఘటనపై సినీ నిర్మాత అల్లు అరవింద్ విచారం వ్యక్తం చేశారు. అందరూ సంయమనం పాటించాలని, అదే మంచిదని వ్యాఖ్యానించారు. "మా ఇంటి బయట జరిగిందంతా చూశారు. ప్రస్తుతం మేం సంయమనం పాటించాల్సిన సమయం. దేనికీ రియాక్ట్ కాకూడదు. పోలీసులు వచ్చి ఆందోళనకు దిగిన వారిని తీసుకెళ్లారు. కేసు పెట్టారు. ఎవరైనా గొడవ చేయడానికి వస్తే అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు సిద్ధంగా ఉన్నారు. ఇలాంటివి ఎవరూ ప్రోత్సహించకూడదు. మీడియా వచ్చారు కదా అని.. ఈ ఘటనపై మేం స్పందించం. సంయమనం పాటించాల్సిన సమయం.. అదే పాటిస్తున్నాం. తొందరపడి ఎలాంటి చర్యలకు దిగొద్దు" అని విజ్ఞప్తి చేశారు.




## క్విక్ రెస్పాన్స్, టెక్నాలజీతో క్రైమ్ రేట్ తగ్గించాం: రాచకొండ సీపీ

హైదరాబాద్: విజిబుల్ పోలీసింగ్, క్విక్ రెస్పాన్స్, టెక్నాలజీని ఉపయోగించి క్రైమ్ రేటు తగ్గించామని రాచకొండ సీపీ సుధీర్‌బాబు తెలిపారు. 2024లో మొత్తం 33,084 కేసులు నమోదయ్యాయని చెప్పారు. కమిషనరేట్ పరిధి నేర వార్షిక నివేదికను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడారు. "ఈ ఏడాది నమోదైన 33,084 కేసుల్లో 25,143 కేసులు పరిష్కరించాం. 3 షిఫ్టుల్లో పెట్రోలింగ్ ఏర్పాటు చేశాం. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించాం.

ఈ ఏడాది రాష్ట్రంలో అత్యధిక కేసులను పరిష్కరించిన కమిషనరేట్‌గా రాచకొండ నిలిచింది. మా పరిధిలో నమోదైన కేసుల్లో 30 మందికి జీవిత ఖైదు శిక్ష పడింది. అందులోనూ అగ్రస్థానంలో నిలిచాం. సంచలనం సృష్టించిన మోటకొండూరు పీఎస్ పరిధిలో 14 మంది నిందితులకు జీవిత ఖైదు పడింది. వివిధ కేసుల్లో 160 మందికి శిక్ష ఖరారైంది.

**సైబర్ బాధితులకు రూ.22 కోట్ల రిఫండ్ :** లోక్ అదాలత్‌లో 11,440 కేసులతో పాటు 70,791 పెట్టీ కేసులు పరిష్కారమయ్యాయి. ఈ ఏడాది డయల్ 100 ద్వారా 2,41,742 ఫిర్యాదులు వచ్చాయి. అన్ని విభాగాల్లో కలిపితే క్రైమ్ రేటు 4% మాత్రమే పెరిగింది. గతేడాదితో పోలిస్తే హత్యకేసుల్లో ఎలాంటి మార్పు లేదు. చోరీ కేసులు 6%, డొమెస్టిక్ వయిలెన్స్ కేసులు 23% తగ్గాయి. రూ.88.25 కోట్ల విలువైన డ్రగ్స్‌ను సీజ్ చేశాం. మొత్తం 521 మంది డ్రగ్ నేరస్థులను అరెస్ట్ చేశాం. ఆ నిందితులపై 165 రౌడీషీట్లు ఓపెన్ చేశాం. ఎన్నికల సందర్భంగా రూ.16 కోట్ల నగదు, మద్యం సీజ్ చేశాం. సైబర్ బాధితులకు రూ.22 కోట్లు రిఫండ్ అయ్యేలా చర్యలు చేపట్టాం.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com